www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 148 | హైదరాబాద్ | ఆదివారం | 21-09-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## త్వరలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కి ముఖ్యమంత్రి రాక




## హెచ్-1బీ వీసాదారుల్లారా..
# వెంటనే అమెరికాకు రండి

**హెచ్-1బీ వీసాపై లక్ష డాలర్ల వార్షిక ఫీజు విధింపు**

**రేపటి నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధన**

**వెంటనే అమెరికాకు తిరిగి రావాలని ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ సూచన**

**భారతీయ ఐటీ నిపుణులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం**

**మొత్తం హెచ్-1బీ వీసాదారుల్లో 71 శాతం మంది భారతీయులే**

**అమెరికా సెప్టెంబర్ 20(సిద్దిపేట పవర్):**

అమెరికాలో హెచ్ 1బీ వీసాలపై పనిచేస్తున్న ఉద్యోగుల్లో, ముఖ్యంగా భారతీయుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రతి హెచ్ 1బీ వీసాపై లక్ష డాలర్ల భారీ వార్షిక ఫీజును విధిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం రేపటి నుంచి అమల్లోకి రానుంది. ఈ గడువు సమీపిస్తుండటంతో అమెరికా వెలుపల ఉన్న తమ ఉద్యోగులు వెంటనే దేశానికి తిరిగి రావాలని మైక్రోసాఫ్ట్, జేపీ మోర్గాన్ వంటి దిగ్గజ టెక్ కంపెనీలు అంతర్గత సూచనలు జారీ చేశాయి.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, "హెచ్ 1బీ, హెచ్ 4 వీసాదారులు గడువులోగా రేపే అమెరికాకు ..మిగతా 2లో

## ఉద్యోగులకు టెక్ కంపెనీల కీలక సూచన




## ప్రజల జేబులు కొట్టడానికే
# రోడ్ సేఫ్టీ సెస్

కొత్త వాహనాలపై రోడ్ సేఫ్టీ సెస్ విధింపుపై కేటీఆర్ ఆగ్రహం

ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు ఇవ్వకుండా ప్రజలపై భారం మోపడం ఏంటని ఫైర్

వాహనాన్ని బట్టి రూ. 2 వేల నుంచి రూ. 10 వేల వరకు అదనపు వసూలు

గ్యారెంటీలను గాలికొదిలేసి పన్నులు వేస్తున్నారని తీవ్ర విమర్శ

ఇది పేద, మధ్యతరగతిని దగా చేయడమేనన్న మాజీ మంత్రి




# కోటి మంది మహిళలను
# కోటీశ్వరులు చేస్తాం..

**మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**

**ఏడాది కాలంలోనే రూ.21,632 కోట్ల వడ్డీ లేని రుణాలిచ్చాం**

**కేసీఆర్ పాలనలో పట్టించుకున్న పాపాన పోలేదు**

**మహిళా సంఘాలకు రుణాలు, బీమా, వ్యాపార అవకాశాలు**

**ఉచిత బస్సు ప్రయాణం, ఇంద్ర మహిళా శక్తి క్యాంటీన్లపై వివరాలు**



**హైదరాబాద్ సెప్టెంబర్ 20(సిద్దిపేట పవర్):**

మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మహిళలు తమ ఆర్థిక అవసరాల కోసం వడ్డీ వ్యాపారుల దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసఫ్ గూడలో స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి పాల్గొన్నారు. మెప్మా ద్వారా రూ.41.51 కోట్ల వడ్డీ లేని రుణాలను ..మిగతా 2లో

## కాంగ్రెస్‌లో చేరను

**రాజకీయాల్లో స్పేస్ ఇవ్వరు.. తోసుకుంటూ పోవడమే**

**కొత్త పార్టీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు**

**తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన మొదటి కూతురిని నేనే**

**కాంగ్రెస్‌లో చేరే ఆలోచన లేదు.. ఎవరూ ఫోన్ చేయలేదు**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**




## వెంటనే పరిష్కరించాలి

**అమెరికా H1B వీసాలపై కొత్త నియమాలు**

**తెలుగు టెక్కీలపై ప్రభావం**

**భారత ప్రభుత్వానికి తక్షణ చర్యల ఆహ్వానం**




## కాళేశ్వరం కుంభకోణం: కవిత, కేసీఆర్‌పై
# యాష్కీ సంచలన ఆరోపణలు

**మధు యాష్కీ కాళేశ్వరం కేసీఆర్ కుటుంబంపై ఆరోపణలు**

**"కవిత, జైలు నుంచి వచ్చి బలహీన వర్గాల గురించి మాట్లాడటం విడ్డూరం"**

**ఎమ్‌పీగా ఉన్నప్పుడు డబ్బులు వసూలు చేసినదని ఆరోపణ**

**కేంద్రం సీబీఐ విచారణ ఆలస్యం చేస్తోందని యాష్కీ విమర్శ**

**హైదరాబాద్ సెప్టెంబర్ 20(సిద్దిపేట పవర్):**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఆరోపణలు, ప్రత్యారోపణలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నేత మధు యాష్కీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కుటుంబానికి 'ఏటీఎం'గా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభివర్ణించారని గుర్తుచేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా ఇప్పటికీ అది ప్రారంభం కాలేదని ఆయన ఆరోపించారు.

"ప్రతిపక్ష పార్టీలు ఉన్న చోట సీబీఐ, ఈడీలు వచ్చేవి. కానీ ఇక్కడ కేసీఆర్‌పై అసెంబ్లీలో విచారణకు ఆదేశించినా ..మిగతా 2లో



# మెట్రో.. దారి ఎటో!

ఎలాంటి కదలిక లేని ప్రాజెక్ట్

వివిధ అంశాలపై కుదరని సయోధ్య

మొదటి దశ నుంచి వైఫల్యాలగితే నిర్వహణ ఎలా?




## తాటాకు చెప్పుళ్లకు భయపడము..
## పార్టీ కోసం ప్రజలకోసం పనిచేస్తాం

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో గాదరి కిషోర్ విచారణ ముగింపు

సీఎం రమేష్‌పై వ్యాఖ్యల కేసులో మాజీ ఎమ్మెల్యే హాజరు

"నాపై కుట్రపూరితంగా కేసు పెట్టారు" – గాదరి కిషోర్

"తాటాకు చెప్పుళ్లకు భయపడము" – మాజీ ఎమ్మెల్యే స్పష్టం




## ఇన్ఫోసిస్, టీసీఎస్ ఉద్యోగుల
# భవిష్యత్తు ఎక్కడ..?

**మంత్రి శ్రీధర్ బాబు ట్రంప్ H1B ఫీజు పెంపును ఖండించారు**

**85,000 H1B వీసాలు మరియు భారతీయ టెక్ కంపెనీలపై ప్రభావం**

**విద్యార్థులు, ఉద్యోగార్థులు, నిపుణులపై పెనుభారం**

**కేంద్రం మౌనానికి మంత్రి ప్రశ్న, దౌత్య వ్యతిరేక ఫలితాలు**




**హైదరాబాద్ సెప్టెంబర్ 20(సిద్దిపేట పవర్):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న H1B వీసాలపై కొత్త నిర్ణయాలను రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు. ఈ నిర్ణయం భారతీయ సాఫ్ట్వేర్ కంపెనీలకు, చిన్న, మధ్యస్థాయిలోని టెక్ ఫిర్మ్‌లకు పెద్ద ఇబ్బందిని కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ H1B వీసాల ఫీజులను 5 వేల డాలర్ల నుంచి లక్ష డాలర్ల వరకు పెంచారని, ఈ నిర్ణయం కింద అమెరికాలోని సుమారు 85,000 H1B వీసాలు ప్రభావితమవుతాయన్నారు. చిన్న సాఫ్ట్వేర్ కంపెనీలు, అమెరికాలో సేవలందిస్తున్న భారత్ కంపెనీలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని శ్రీధర్ బాబు హెచ్చరించారు.

హిందూస్థాన్ దేశంలోని భారతీయ టెక్ కంపెనీలు, ముఖ్యంగా ..మిగతా 2లో

## తాటాకు చెప్పుళ్లకు భయపడము..
# పార్టీ కోసం ప్రజలకోసం పనిచేస్తాం

- **జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో గాదరి కిషోర్ విచారణ ముగింపు**
- **సీఎం రమేష్‌పై వ్యాఖ్యల కేసులో మాజీ ఎమ్మెల్యే హాజరు**
- **"నాపై కుట్రపూరితంగా కేసు పెట్టారు" – గాదరి కిషోర్**
- **"తాటాకు చెప్పుళ్లకు భయపడము" – మాజీ ఎమ్మెల్యే స్పష్టం**



**హైదరాబాద్ సెప్టెంబర్ 20(సిద్దిపేట పవర్):**

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌పై విచారణ జరిగింది. సీఎం రమేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కేసులో ఆయన శనివారం విచారణకు హాజరయ్యారు. సుమారు 30 నిమిషాల పాటు పోలీసులు ఆయనను ప్రశ్నించారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన గాదరి కిషోర్ మాట్లాడుతూ.. "మా నాయకుడు కేటీఆర్‌పై సీఎం రమేష్ దూషణలు చేశారు. దానికి సమాధానంగా నేను మాట్లాడాను. కానీ నాపై కుట్రపూరితంగా కేసు నమోదు చేశారు. నేను అనని వాఖ్యలను వీడియోల రూపంలో చిత్రీకరించి నాపై ఆరోపణలు మోపారు" అని అన్నారు.

"ఆయన టీడీపీ ఎంపీనా? బీజేపీ ఎంపీనా? అర్థం కాని స్థితిలో ఉన్నారు. రాజకీయాలకన్నా వ్యాపారాల మీదే ఆయన దృష్టి ఉంది. కేటీఆర్‌పై వ్యక్తిగత దూషణలు చేశారు. మేము మాత్రం పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తాం. తాటాకు చెప్పుళ్లతో మమ్మల్ని భయపెట్టలేరు" అని స్పష్టం చేశారు. తాను చట్టాలను గౌరవిస్తానని, అందుకే ఈరోజు విచారణకు హాజరయ్యానని గాదరి కిషోర్ తెలిపారు. "పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాను" అని ఆయన వెల్లడించారు.

## ఇన్ఫోసిస్, టీసీఎస్ ఉద్యోగుల
# భవిష్యత్తు ఎక్కడ..?

**మొదటిపేజీ తరువాయి**




ఇన్ఫోసిస్‌లో లక్షన్నర మంది, టీసీఎస్‌లో సుమారు లక్ష ఇరువై వేల మంది ఉద్యోగులు H1B వీసాలతో పనిచేస్తున్నారని మంత్రి వివరించారు. ఆయన అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం విద్యార్థులు, ఉద్యోగార్థులు, నిపుణులు ఎదుర్కొనే అవకాశాలను కూడా తగ్గిస్తుంది, అమెరికా స్వంతంగా మేధావుల, టాలెంట్ వృద్ధికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నట్టు అనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. "భారత టెక్ కంపెనీలపై వచ్చే భారం, దౌత్యపరమైన సమస్యలకు కేంద్రం ఎందుకు స్పందించడం లేదు?" అని ప్రశ్నించారు. ఈ అనాలోచిత నిర్ణయం భారతీయ టాలెంట్, మేధావుల కలలను చాటుతూ, అమెరికాలో భారతీయ కంపెనీల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.




## హెచ్-1బీ వీసాదారుల్లారా..
# వెంటనే అమెరికాకు రండి

**మొదటిపేజీ తరువాయి**

తిరిగి రావాలని మేం గట్టిగా సిఫార్సు చేస్తున్నాం" అని మైక్రోసాఫ్ట్ తమ ఉద్యోగులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. అలాగే, ఇప్పటికే అమెరికాలో ఉన్న ఉద్యోగులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకూ అంతర్జాతీయ ప్రయాణాలు మానుకోవాలని సూచించాయి. అయితే, ఈ విషయంపై మైక్రోసాఫ్ట్ గానీ, జేపీ మోర్గాన్ గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు.

ఈ కొత్త ఫీజు విధానం 12 నెలల పాటు అమలులో ఉంటుందని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా అమెరికా ఖజానాకు 100 బిలియన్ డాలర్లకు పైగా ఆదాయం సమకూరుతుందని, దీనిని జాతీయ అప్పును తగ్గించడానికి, పన్ను కోతలకు ఉపయోగిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే, ఈ కొత్త నిబంధన ప్రతిభావంతుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తుందని, ఆవిష్కరణలను దెబ్బతీస్తుందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నిర్ణయం భారతీయ ఐటీ నిపుణులపై, కంపెనీలపై పెను ప్రభావం చూపనుంది. అమెరికాలో హెచ్ 1బీ వీసాలు పొందిన వారిలో సుమారు 71 శాతం మంది భారతీయులే. ఇన్ఫోసిస్, విప్రో, కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి సంస్థల్లో పనిచేస్తున్న వారే వీరిలో అధికం. ట్రంప్ ప్రకటన వెలువడిన వెంటనే ఈ కంపెనీల షేర్లు 2 నుంచి 5 శాతం వరకు పడిపోయాయి. సాధారణంగా మూడేళ్ల కాలపరిమితితో జారీ చేసే ఈ వీసాలకు ఏటా లక్ష డాలర్లు చెల్లించడం కంపెనీలకు భారంగా మారనుంది. ఇప్పటికే గ్రీన్ కార్డుల కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న భారతీయ నిపుణులను ఉద్యోగాల్లో కొనసాగించడం కంపెనీలకు సవాలుగా మారనుంది.

# వెంటనే పరిష్కరించాలి

- **అమెరికా H1B వీసాలపై కొత్త నియమాలు**
- **తెలుగు టెక్కీలపై ప్రభావం**
- **భారత ప్రభుత్వానికి తక్షణ చర్యల ఆహ్వానం**

**హైదరాబాద్ సెప్టెంబర్ 20(సిద్దిపేట పవర్):**

అమెరికాలో విదేశీ ఉద్యోగులకు ఇచ్చే H1B వీసాలపై ట్రంప్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై విదేశీ ఉద్యోగులను నియమించుకునే యూఎస్ కంపెనీలు ప్రభుత్వానికి 1,00,000 డాలర్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ. 88 లక్షలు అవుతుంది. ఈ చర్య భారతీయ ఐటీ ఉద్యోగులను, ముఖ్యంగా టెక్కీలను గణనీయంగా ప్రభావితం చేయనుంది. ప్రస్తుతం H1B వీసా హోల్డర్లలో దాదాపు 70 శాతం మంది భారతీయులే ఉన్నారు.

ఈ నిర్ణయంతో అనేక యూఎస్ కంపెనీలు స్థానిక అమెరికన్లను నియమించుకోవడానికి ప్రాధాన్యం ఇస్తాయని ట్రంప్ పరిపాలన పేర్కొంది. తక్కువ ఖర్చుతో పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులు స్వదేశాలకు వెళ్లిపోతారని యూఎస్ వాణిజ్య కార్యదర్శి వ్యాఖ్యానించారు. అలాగే, H1B వీసా వ్యవస్థను ఐటీ అవుట్ సోర్సింగ్ సంస్థలు దుర్వినియోగం చేస్తున్నాయని, ఇది అమెరికా జాతీయ భద్రతకు కూడా ముప్పు అని ట్రంప్ ఆరోపించారు.

ఈ పరిణామంపై తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఎక్స్ (X) వేదికగా స్పందిస్తూ "అమెరికా అధ్యక్షుడు తీసుకున్న ఆ ఆర్డర్లు అందరినీ ఆశ్చర్యపరిచాయి. భారతఅమెరికా సంబంధాల్లో ఇది సరైనది కాదు. మన సాంకేతిక నిపుణులు, నైపుణ్య ఉద్యోగుల హితాలను కాపాడుతూ, ఈ సమస్యను త్వరగా పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. తెలుగు టెక్కీలకు ఇది పెద్ద కష్టంగా ఉంటుంది. గౌరవనీయ ప్రధాన మంత్రి గారికి మరియు విదేశాంగ మంత్రి శ్రీ @DrSJaishankar గారికి ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నాను." అని రాసుకొచ్చారు.

# కోటి మంది మహిళలను
# కోటీశ్వరులు చేస్తాం..

**మొదటిపేజీ తరువాయి**

చెక్కు రూపంలో సంఘాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, మహిళా శక్తికి ఎన్ని కోట్లయినా ప్రభుత్వం ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

**పదేళ్లు అన్యాయం**

గత పదేళ్లుగా మహిళా సంఘాలను పట్టించుకున్న నాథుడు లేడని భట్టి విక్రమార్క విమర్శించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని అత్యంత శక్తివంతులుగా ఎదిగేందుకు తగిన సహాయ సహకారాలు అందించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్ నగరానికి సంబంధించి 63 లక్షల మంది సభ్యులుంటే జీహెచ్ఎంసీ పరిధిలో 30 సర్కిళ్లలో 50,764 సంఘాల్లో 5,09,957 మంది సభ్యులున్నారని తెలిపారు. ఈ సంఖ్యను రాబోయే రోజుల్లో గణనీయంగా పెంచుతామన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 8,130 మంది మహిళలు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్నారని వివరించారు. హైదరాబాద్ పట్టణంలో పేద, మధ్యతరగతి వర్గానికి చెందిన అనేక కుటుంబాలు భర్తతో పాటు భార్య ఏదో ఒక చిరు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని తెలిపారు. చిరు వ్యాపారాలు చేసే కుటుంబాలు వ్యాపార పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల దగ్గర పది రూపాయల వడ్డీకి పెట్టుబడులు తెచ్చుకుంటున్నారని, వారు చేసే వ్యాపారం వడ్డీలు చెల్లించేందుకు సరిపోతుందన్నారు. ఐదు సంవత్సరాల్లో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని సర్కారు లక్ష్యంగా పెట్టుకుని, ఆ దిశగా ముందుకెళుతున్నట్లు భట్టి వివరించారు. అందులో భాగంగా ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించాలని నిర్ణయిస్తే ప్రతిపక్షాలు, కొందరు వ్యక్తులు ఇది సాధ్యమేనా అంటూ అవహేళన చేశారని గుర్తు చేశారు. వారందరి అంచనాలు తలకిందులు చేస్తూ తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే రూ.21,632 కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించి, అరుదైన రికార్డు సృష్టించామని వివరించారు. రాబోయే రోజుల్లో మహిళా సంఘాల సభ్యులు పెట్టుబడుల కోసం ఏ వడ్డీ వ్యాపారి దగ్గరకు వెళ్లాల్సిన పని లేదని, మీ శ్రమ వృధా కాదని, డ్వాక్రా సంఘాల్లో ఎంతమంది సభ్యులుగా చేరాలనుకుంటే వారందరినీ చేర్చుకుని, ఆర్థిక చేయూతను అందిస్తామని భట్టి స్పష్టం చేశారు.

**కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తాం..**

హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సర్కారు మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని, మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గడిచిన నాలుగేళ్లలో రాజధాని హైదరాబాద్‌లో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలివ్వలేదని గుర్తు చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని వివరించారు. మహిళలు ప్రతి ఒక్కరూ సంఘాలలో సభ్యులుగా ఉండి వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకుని మహారాణులుగా ఉండాలని సూచించారు. మంత్రి గడ్డం వివేక్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో వడ్డీ లేని రుణాలు అందించడంతో మహిళలు మరింత ఆర్థికంగా బలపడుతున్నారన్నారు. నారాయణపేట జిల్లాలో మహిళా సంఘాలు పెట్రోల్ బంక్ నిర్వహిస్తూన్నారని తెలిపారు. ఆర్టీసీ బస్సులు, గ్యాస్ ఏజెన్సీలు, ఇందిరమ్మ క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెస్ యూనిట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల జేబులు కొట్టడానికే
# రోడ్ సేఫ్టీ సెస్

- **కొత్త వాహనాలపై రోడ్ సేఫ్టీ సెస్ విధింపుపై కేటీఆర్ ఆగ్రహం**
- **ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు ఇవ్వకుండా ప్రజలపై భారం మోపడం ఏంటని ఫైర్**
- **వాహనాన్ని బట్టి రూ. 2 వేల నుంచి రూ. 10 వేల వరకు అదనపు వసూలు**
- **గ్యారెంటీలను గాలికొదిలేసి పన్నులు వేస్తున్నారని తీవ్ర విమర్శ**
- **ఇది పేద, మధ్యతరగతిని దగా చేయడమేనన్న మాజీ మంత్రి**



**హైదరాబాద్ సెప్టెంబర్ 20(సిద్దిపేట పవర్):**

తెలంగాణలో కొత్తగా వాహనాలు కొనుగోలు చేసేవారిపై 'రోడ్ సేఫ్టీ సెస్' పేరుతో ప్రభుత్వం అదనపు భారం మోపడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. ఇది పేద, మధ్యతరగతి ప్రజలను దగా చేయడమేనని ఆయన మండిపడ్డారు. రహదారి ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సింది పోయి, ఆ భారాన్ని ప్రజలపైకి నెట్టడం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించి రహదారుల భద్రతా ప్రమాణాలను పెంచాల్సిన బాధ్యతను విస్మరించి, అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయాలని చూడటం దారుణమని కేటీఆర్ అన్నారు. కొత్తగా కొనే ప్రతి వాహనంపై రూ. 2 వేల నుంచి రూ. 10 వేల వరకు సెస్ వసూలు చేయాలన్న నిర్ణయం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'హైడ్రా' వంటి తప్పుడు విధానాలతో ప్రభుత్వ ఖజానాకు గండికొట్టి, ఇప్పుడు ఆ లోటును పూడ్చుకోవడానికే ఇలాంటి పన్నులు వేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఇచ్చిన గ్యారెంటీలను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ప్రజల నుంచి రూ. 270 కోట్లు ముక్కుపిండి వసూలు చేసేందుకు కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు. కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని, అప్పు చేసి వాహనాలు కొనే సామాన్యుల జేబులు కొట్టే ఇలాంటి చర్యలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలు కాంగ్రెస్ సర్కారును క్షమించరని ఆయన హెచ్చరించారు.

## కాళేశ్వరం కుంభకోణం: కవిత, కేసీఆర్‌పై
# యాష్కీ సంచలన ఆరోపణలు

**మొదటిపేజీ తరువాయి**



కేంద్రం ఎందుకు ముందుకు రావడం లేదు?" అని మధు యాష్కీ ప్రశ్నించారు. దీంతో బీజేపీబీఆర్ఎస్ మైత్రి బయటపడిందని ఆయన వ్యాఖ్యానించారు. తొమ్మిదేళ్ల తర్వాత కవితకు కాళేశ్వరం గుర్తుకు వచ్చిందని, జైలుకు పోయి వచ్చిన ఆమె నీతులు చెప్పడం, అవినీతిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

"పదేళ్లు బడుగులను దోచిన కవిత... ఇప్పుడు బీసీల గురించి మాట్లాడటం ఏంటి?" అని యాష్కీ ప్రశ్నించారు. కవిత వ్యవహారం చూస్తుంటే కేసీఆర్ రచించిన నాటకం నుండి బయటకు వస్తున్నట్టు ఉందని, కేసీఆర్ రచించిన 'కవిత'లో కవిత ఓ భాగమని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓపెన్‌గానే ఉంటారని, తప్పితే వెనకాల ఉండి చేయడం ఆయనకు అలవాటు లేదని చెప్పారు. కవిత వెనకాల సీఎం ఉన్నాడనేది చవకబారు ప్రచారమేనని ధ్వజమెత్తారు.

స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్‌కు అనుకూలంగానే ఉంటాయని యాష్కీ ధీమా వ్యక్తం చేశారు. "స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతే ఏం చెప్పాలి అనే దానికోసం కేసీఆర్ కుటుంబం డ్రామా చేస్తుందా?" అని ప్రశ్నించారు. కవితపై నేరుగా ఆరోపణలు చేస్తూ, హిమాయత్‌నగర్‌లో ఉన్న విమలక్క ఆఫీస్‌ను ఖాళీ చేయించిందని, ఎక్కడా రెంట్ ఇవ్వకుండా చేసిందని ఆరోపించారు. కవితకు పోటీగా బతుకమ్మ పెట్టిందని కక్ష సాధించిందని, అలాంటి కవిత ఇప్పుడు బలహీన వర్గాల గురించి మాట్లాడుతుందని విమర్శించారు.

ఎంపీగా ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో డబ్బులు దండుకున్నదని, 10 మందికి శిక్షణ ఇచ్చి 100 మంది డబ్బులు దోచుకుందని యాష్కీ ఆరోపించారు. రైతుల కుటుంబాలను ఆదుకుంటాం అని డబ్బులు వసూలు చేసి వెనకేసుకుందని, హీరో నాగార్జున లాంటి వాళ్ల నుండి కూడా డబ్బులు వసూలు చేసి రైతులకు ఇస్తా అన్నదని చెప్పారు.

భవిష్యత్ రాజకీయాలపై మాట్లాడుతూ... ఎన్డీఏ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాదని యాష్కీ అంచనా వేశారు. కాంగ్రెస్‌ను అడ్డుకోవడం కోసం కేసీఆర్‌ను రక్షించే కుట్రను బీజేపీ చేస్తుందని, అందుకే సీబీఐ విచారణను ఆలస్యం చేస్తుందని ఆరోపించారు. "విచారణ చేసి కూడా కేసీఆర్ నిర్దోషి అని చెప్పే ప్రయత్నం కూడా జరగొచ్చు" అని ఆయన హెచ్చరించారు. కేటీఆర్‌పై కూడా విమర్శలు గుప్పించిన యాష్కీ.. "కేటీఆర్... సీఎం రమేష్‌ను కలవలేదు అని చెప్పలేదు. చర్చ చేయలేదు అని కూడా చెప్పడం లేదు" అని అన్నారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. బీఆర్ఎస్ నుండి ఇంకా స్పందన రావాల్సి ఉంది.

# మెట్రో.. దారి ఎటో!

- **ఎలాంటి కదలిక లేని ప్రాజెక్ట్**
- **వివిధ అంశాలపై కుదరని సయోధ్య**
- **మొదటి దశ నుంచి వైదొలగితే నిర్వహణ ఎలా?**

**హైదరాబాద్ సెప్టెంబర్ 20(సిద్దిపేట పవర్):**

మెట్రో ప్రాజెక్టు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఒకవైపు మొదటి దశకు సంబంధించి నష్టాలను భరించలేక నిర్వహణ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు ఎల్అండ్‌టీ ప్రకటించింది. మరోవైపు రెండో దశ విషయంలో కేంద్రం నుంచి ఇప్పటివరకూ అనుమతి లభించలేదు. పైగా ఇప్పట్లో ఆ అవకాశం కూడా లేదు. మొదటి దశ రైలు మార్గాలపై సమన్వయం కుదిరే వరకు ఈ ప్రతిష్టంభన ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. దీంతో వచ్చే ఎన్నికల నాటికి కూడా పట్టుమని పది కిలోమీటర్ల లైన్‌లు నిర్మాణమయ్యే దాఖలాలు కనిపించడం లేదు.

ఒకవైపు మెట్రోను వదులుకొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ ప్రకటించిన వెంటనే హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తప్పించి హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. మెట్రో రైల్ నిర్మాణదశ నుంచి ఇటీవల వరకు సుమారు 18 సంవత్సరాల పాటు ఈ రంగంలో అపారమైన అనుభవాన్ని ఆర్జించిన ఎన్వీఎస్ హైదరాబాద్ మెట్రోమ్యాన్‌గా గుర్తింపును పొందారు. ఆ స్థాయిలో అనుభవాన్ని సంపాదించడానికి ప్రస్తుత ఎండీకి కొంత సమయం పట్టవచ్చు. పైగా ఆయనకు ఈ బాధ్యత అనేక సవాళ్లతో కూడుకొని ఉంది. సకాలంలో ఈ సవాళ్లను అధిగమించి రెండో దశ ప్రాజెక్టును పట్టాలెక్కించడం అంత సులువు కాకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**రెండు దశలు 'లింక్' అయ్యేనా..**

రెండో దశపై కేంద్రం లేవనెత్తిన ప్రశ్నలతోనే తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి. మొదటి దశలోని 69 కి.మీ. అలైన్‌మెంట్‌కు కొనసాగింపుగానే ప్రభుత్వం వివిధ దశల్లో రెండోదశ విస్తరణకు ప్రణాళికలను రూపొందించింది. ఈ క్రమంలో ప్రైవేట్ సంస్థ అయిన ఎల్అండ్‌టీ నిర్వహణలో ఉన్న మొదటిదశకు, ప్రభుత్వమే చేపట్టి నిర్వహించనున్న రెండో దశకు సమన్వయం ఎలా ఉంటుందని కేంద్రం ప్రశ్నించింది. ఆదాయ, వ్యయాలు, రైళ్ల నిర్వహణ, విద్యుత్ వినియోగం, టికెట్ చార్జీల పంపకాలు వంటి అంశాలను ప్రస్తావించింది. ఈ క్రమంలో సమన్వయం సన్నద్ధతను తెలియజేయాల్సిన ఎల్అండ్‌టీ అందుకు భిన్నంగా ప్రాజెక్టు నుంచి తప్పుకొనేందుకే సిద్ధంగా ఉన్నట్లు సంచలన ప్రకటన చేసింది.

తీవ్ర నష్టాల్లో ఉన్నట్లు మొదటి నుంచి ఆ సంస్థ ప్రతినిధులు చెబుతూనే ఉన్నారు. అదే నష్టాలను ప్రధాన సాకుగా చూపుతూ ప్రాజెక్టును వదిలించుకోనున్నట్లు పేర్కొంది. దీంతో మొత్తం రెండు దశల మెట్రో భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మొదటి దశ నిర్వహణ కోసం ప్రభుత్వం ఎల్అండ్‌టీతో బేరసారాలు, బుజ్జగింపుల పర్వాన్ని కొనసాగించనుందా? లేక ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)ని ఏర్పాటు చేసి రెండో దశల నిర్వహణకు అప్పగించనుందా? అనేది ప్రశార్థకంగా మారింది. ఒకవేళ అలాంటి ఎస్పీవీకి సానుకూలమైతే తిరిగి ఏదో ఒక ప్రైవేట్ సంస్థను ఎంపిక చేయాల్సిందే. కానీ.. మెట్రో నిర్మాణంలో, నిర్వహణలో అపారమైన అనుభవం ఉన్న ఎల్అండ్‌టీ స్థాయి సంస్థలు లేవనేది నిర్వివాదమైన అంశం. ఈ క్రమంలో ఎస్పీవీ ఏర్పాటు కూడా ఏ మాత్రం తేలికైన వ్యవహారం కాదు.



**చెల్లింపులు ఎలా..?**

నిధుల కొరత మరో సవాల్‌గా నిలిచింది. రెండో దశ కోసం అంతర్జాతీయ సంస్థల నుంచి పెద్ద ఎత్తున రుణాలను సేకరించాలనేది ప్రభుత్వ యోచన. కేంద్రం ఈ ప్రాజెక్టును ఆమోదించి తన వాటా నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలంటే జైకా వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలను సేకరించాల్సిందే. రెండో దశలో 'ఎ' విభాగం కింద ప్రతిపాదించిన 76.4 కి.మీ.,లకు సుమారు రూ.24,269 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా. 'బి' విభాగం కింద ప్రతిపాదించిన మూడు మార్గాల్లో అంటే సుమారు 85 కి.మీ. మరో 19వేల కోట్లకు పైగా ఖర్చుకానుంది. ఇదే సమయంలో మొదటి దశ మెట్రో నిర్వహణ నుంచి ఎల్అండ్‌టీ వైదొలిగితే ఆ సంస్థకు దాదాపు రూ.6500 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఇటు మొదటి దశ చెల్లింపులకు, అటు రెండో దశ నిర్మాణానికి నిధుల సేకరణ మరో సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం పాతబస్తీలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5.కి.మీ.మార్గంలో మెట్రో నిర్మాణ పనులను చేపట్టి ఎన్నికలకు వెళ్లాలని భావించిన అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుత పరిణామాలతో మింగుడుపడని పరిస్థితి నెలకొంది. అంతా అనుకున్నట్లు జరిగితే నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు అక్కడి నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు రెండోదశలో మొదట మెట్రో నిర్మాణం చేపట్టి మార్కులు కొట్టేయాలని భావించిన ప్రభుత్వ పెద్దలు ఈ సవాళ్లన్నింటినీ అధిగమించడం ఏ మాత్రం ఆషామాషీ వ్యవహారం కాదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే మెట్రో భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది.

# కాంగ్రెస్‌లో చేరను

- రాజకీయాల్లో స్పేస్ ఇవ్వరు.. తోసుకుంటూ పోవడమే
- కొత్త పార్టీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు
- తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన మొదటి కూతురిని నేనే
- కాంగ్రెస్‌లో చేరే ఆలోచన లేదు.. ఎవరూ ఫోన్ చేయలేదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

రాజకీయాల్లో స్పేస్ ఇవ్వరని తోసుకుంటూ పోవాల్సిందేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కొత్త పార్టీ పెట్టాలా లేదా అనే దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. పార్టీ పెట్టే ముందు కేసీఆర్ వందల మందితో చర్చలు జరిపారని, ప్రస్తుతం తానూ అదే చేస్తున్నానని స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి సంస్థ రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియాతో చిట్ చాట్ చేశారు. తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన మొదటి కూతురిని తానే అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చని చెప్పారు. ఇరిగేషన్ శాఖ విషయంలో 2016లోనే కేటీఆర్‌ను అలర్ట్ చేశానన్నారు. నేరుగా సీఎంకే ఫైళ్లు వెళ్తున్నాయని చెప్పానని గుర్తు చేశారు. కింది స్థాయి కమిటీ పరిశీలన, ఆమోదం లేకుండానే సీఎంకు ఫైళ్లు వెళ్లాయని, కాళేశ్వరం విషయంలో ప్రతి నిర్ణయం కేసీఆర్ దేనని హరీశ్ రావు పీసీ ఘోష్ కమిషన్‌కు చెప్పారన్నారు. కమిషన్ నివేదిక చూస్తే అన్నీ అర్థమవుతాయని వ్యాఖ్యానించారు. హరీశ్ రావుపై కాళేశ్వరం విషయంలో తప్ప తనకు వేరే కోపం లేదని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్‌లో చేరను..**

కాంగ్రెస్ పార్టీలో చేరే ఆలోచన తనకు లేదని కవిత అన్నారు. కాంగ్రెస్ పెద్దలు ఎవరూ తనకూ ఫోన్ చేయలేదని, తాను ఎవర్నీ అప్రోచ్ కాలేదని వెల్లడించారు. బీసీ సమస్య తన మనస్సుకు దగ్గరగా అనిపించిందని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోకుంటే ముఖ్యమంత్రి, మంత్రుల ఇళ్ళను ముట్టడిస్తామని హెచ్చరించారు. చాలామంది తనను కలుస్తున్నారని, ఎమ్మెల్సీ పదవికి స్పీకర్ ఫార్మాట్‌లోనే రాజీనామా చేసినట్లు చెప్పారు. తన రాజీనామాను ఆమోదించాలని చైర్మన్‌ను కోరినట్లు పేర్కొన్నారు. ఎందుకు ఆలస్యం చేస్తున్నారో తనకు తెలియదని తెలిపారు. బీఆర్ఎస్ ద్వారా వచ్చిన పదవి ఆనాడు వద్దనుకున్నాను, ఇప్పుడు వద్దనుకుంటున్నానని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో తనను ఇబ్బందులు పెట్టారని, ఈ విషయం తెలంగాణ ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు.




హరీశ్ రావు మీడియా, బీఆర్ఎస్ సోషల్ మీడియా, సంతోశ్ రావు సీక్రెట్ మీడియా తనపైన దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ఊరు నుంచి ఆహ్వానం వచ్చింది కాబట్టే చింతమడకకు బతుకమ్మ ఉత్సవాలకు వెళ్తున్నానని, తాను అక్కడకు వెళ్లడాన్ని రాజకీయ కోణంలో చూస్తారని తెలుసు అన్నారు.

**కృష్ణానది తెలంగాణకు వరం**

ఉమ్మడి ఏపీలో కృష్ణానది జలాల్లో తెలంగాణ వాటా కోసం పోరాటం చేశామని కవిత గుర్తు చేశారు. అప్పుడు స్టే వచ్చిందని, ఇప్పుడు కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు పెంచడానికి లక్షా 30వేల ఎకరాలు సేకరించడానికి సిద్ధమైందన్నారు. అదే జరిగితే కృష్ణా నదిలో తెలంగాణ ప్రాంతం వాళ్ళు క్రికెట్ ఆడుకోవడం తప్ప చేసేది ఏం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా నది బోర్డు మీటింగ్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు సీఎం పాల్గొని ఆల్మట్టికి వ్యతిరేకంగా వాదనలు వినిపించాలని కోరారు.

## పీఎం బహుమతుల వేలంలో చేర్యాల పెయింటింగ్కు చోటు

**చేర్యాల, సెప్టెంబర్ 20 (సిద్దిపేట పవర్)** చేర్యాల పెయింటింగ్కు పీఎం బహుమతుల వేలంలో చోటు దక్కింది. అక్టోబర్ 2వ తేదీ వరకు పీఎం మెమెంటోస్ పోర్టల్లో ఆన్లైన్ ద్వారా జరిగే వేలంలో ఎవరైనా పాల్గొని ఈ బహుమతులను సొంతం చేసుకోవచ్చని పేర్కొంది. ఈ వేలంలో దక్షిణాదిలో తమిళనాడు నుంచి 29, కేరళ నుంచి 15, ఏపీ నుంచి వేలానికి ఉంచిన బహుమతుల్లో శ్రీవేంకటేశ్వరస్వామి బొమ్మలు రెండు, తెలంగాణ నుంచి చేర్యాల పెయింటింగ్, కాకతీయ కళాతోరణం వెండి కళాకృతి ఉన్నాయి.



## మిరుదొడ్డి తెలంగాణ మోడల్ స్కూల్ లో బతుకమ్మ సంబరాలు.

**సిద్దిపేట పవర్ సెప్టెంబర్ 20 మిరుదొడ్డి** ఉమ్మడి మిరుదొడ్డి మండల వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ప్రతీక అయినటువంటి బతుకమ్మ సంబరాలను ప్రభుత్వం ప్రైవేటు రంగ విద్యాసంస్థల్లో నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ ప్రైవేటు కళాశాల విద్యార్థినిలు బతుకమ్మ సంబరాల్లో పాల్గొని బతుకమ్మ చరిత్రను ముందు తరాలకు అందించే దిశగా పాటల రూపంలో గానీ ఆటల రూపంలో గానీ అటు ఉపాధ్యాయులను ఇటు తల్లిదండ్రులను కనువిందు చేసేలా వల్ల నాట్య ప్రదర్శనలు ఉన్నాయి. మిరుదొడ్డి మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని కళాశాల మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం తెలపడం జరిగింది. ఈ బతుకమ్మ సంబరాలు విద్యార్థినీలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ అంటేనే బతుకమ్మ అనే నినాదంతో వారి వారి పాఠశాలలో కళాశాలలో నిర్వహించిన సంబరాలను బతుకమ్మ మన సాంస్కృతి సాంప్రదాయాలను కనువిందు చేసేలా ఉంది అని వారి యొక్క నాట్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు కళాశాల విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని. దేవేందర్ పరమేశ్వర్ ప్రమోద్ శ్రీనివాస్ దేవరాజ్. పాఠశాల బృందం అశ్విని స్వర్ణలత రాజేశ్వరి నాగరత్న శైలజ అనురాధ పాఠశాల కళాశాల బృందం పాల్గొనడం జరిగింది.







## తెలంగాణ ఆత్మగౌరవానికి సూచిక బతుకమ్మ

**చేర్యాల, సెప్టెంబర్ 20 (సిద్దిపేట పవర్)** చేర్యాల పట్టణంలోని ప్రెసెంటేషన్ పాఠశాలలో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలసి రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి సాంప్రదాయ వాతావరణంలో పాడుతూ, ఆడుతూ వేడుకలను ఆహ్లాదకరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బతుకమ్మ పండుగ తెలుగు రాష్ట్రాల ఆచార సంప్రదాయాలకు ప్రతీకమని, పూలతో చేసిన ఈ వేడుక మన సంస్కృతిలోని విశిష్టతను ప్రపంచానికి తెలియజేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ ఉత్సవాల ద్వారా ఐక్యత, సాంస్కృతిక విలువలు, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను నేర్చుకోవాలని ఆమె సూచించారు. చివరిగా, బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ, ఆటలాడుతూ వేడుకలను విద్యార్థులు ఉత్సాహంగా జరిపారు. మొత్తం పాఠశాల ఆనందోత్సాహాలతో నిండిపోయింది.




## ఆరోగ్య లక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 20**

ప్రతినిధి దుబ్బాక. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెర్వాపూర్ అంగన్వాడి సెంటర్ లో పోషణ మాసం షెడ్యూల్ లో భాగంగా శనివారం ఆధార్ కార్డు కలిగిన ప్రతి పిల్లవాడికి అపార ఐ డి నెంబర్ చేయాలని మరియు తల్లులు గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని అందరూ ఆరోగ్య లక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని 1000 రోజుల ప్రాముఖ్యత ను గురించి అవగాహన కల్పించడం జరిగింది. కిషోరబాలికలు, బలమైన ఆహారం తీసుకోవాలని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ చంద్రకళ, అంగన్వాడీ స్కూల్ టీచర్ సత్యలక్ష్మి, కిషోరబాలికలు పాల్గొన్నారు.




## ఆదర్శవంతమైన పాఠశాలలుగా తయారీ చేయడమే లక్ష్యం

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 20 ( సిద్దిపేట పవర్ )** :కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఇటీవలవార్డు 7 లాల్ బజార్ ప్రభుత్వ బాలికల ప్రాధమిక,ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అతి త్వరలోనే పాఠశాలలలో కావలసిన మౌలిక వసతులను ఏర్పాటు చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం మొదటి విడతగా 20 లక్షల రూపాయలను మంజూరు చేపించి శనివారం ఎమ్మెల్యే శ్రీగణేష్ పాఠశాలకు వెళ్లి విద్యార్థినులకు స్పోర్ట్స్ కోర్ట్, మధ్యాహ్న భోజనం చేయడానికి షెడ్డు ( మిడ్ డే మీల్స్ షెడ్), మినరల్ వాటర్ ప్లాంట్, డిజిటల్ క్లాస్ ల కోసం టి. వి,సాంస్కృతిక కార్యక్రమాల కోసం స్టేజ్, సోలార్ సిస్టమ్, ప్రహరీ గోడ నిర్మాణం తదితర మౌలిక వసతుల ఏర్పాటుకు ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కలిసి భూమి పూజ చేశారు. భూమి పూజ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శవంతంగా నిలవడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తమ విద్యను అభ్యసించడానికి ఎన్ని నిధులైనా తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తానని చెప్పారు విద్యార్థినీ విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలలో కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు విద్య పై ఉన్న మక్కువతో విద్యాశాఖను తన వద్ద ఉంచుకున్నారని విద్య కోసం ఎన్ని నిధులైనా ఇవ్వడానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని చెప్పారు.ఈ భూమి పూజ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగినేని సరిత, మురళీ ముదిరాజ్, భవాని తదితరులు పాల్గొన్నారు









## గంభీర్ పూర్ పాఠశాలలో చిన్నారులతో బతుకమ్మ సంబరాలు

**దుబ్బాక సిద్దిపేట పవర్ సెప్టెంబర్ 20 ప్రతినిధి**

ప్రాథమికోన్నత పాఠశాల గంభీర్ పూర్ లో ముందస్తు బతుకమ్మ దసరా పండగ విద్యార్థులతో అంగరంగ సంబరాలు నిర్వహించారు .ఇందులో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయు రాలు వి. మాధవి ఉపాధ్యాయులు బి. శ్రీనివాస్. టి యాదయ్య. బి. బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు పండుగ విశిష్టతను తెలియజేయడం జరిగింది అలాగే సెలవుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారి తల్లిదండ్రులు తెలియజేశారు .కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పిల్లలు బతుకమ్మ సంబరాల వేడుకల్లో ప్రతిరోజు చిన్న పిల్లలు వారి ఇంట్లో బతుకమ్మ పేర్చి వారు చెరువులోకి వెళ్లేటప్పుడు తమ ఇంటి అమ్మలు వారితో వెళ్లి పిల్లలను జాగ్రత్త చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచన చేశారు. వచ్చే నెల 4వ తేదీ పాఠశాల ప్రారంభోత్సవం తిరిగి పిల్లలు పాఠశాలకు సుఖ సంతోషాలతో రావాలని మనసు పూర్తిగా కోరుకుంటున్నాను. ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది







## యువత క్రీడల్లో మెరుగ్గా రాణించాలి

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 20 ( సిద్దిపేట పవర్ ):** బొల్లారం (వార్డు 8) కంటోన్మెంట్ పబ్లిక్ గ్రౌండ్స్ లో గార్డెన్ ఫుట్ బాల్ క్లబ్( GFC) ఆధ్వర్యంలో ఛాంపియన్స్ కప్ సీజన్-1 టోర్నమెంట్ ను శనివారం నిర్వహించారు.కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఫైనల్ మ్యాచ్ ను తిలకించి టోర్నమెంట్ విన్నర్స్ బ్రాలర్స్ టీం కు ట్రోఫీ తో పాటు 10 వేల నగదు బహుమతి,రన్నర్స్ బ్లూ ఫ్లేస్ టీంకు ట్రోఫీతో పాటు 5 వేల నగదు బహుమతులతో పాటు ఉత్తమ ప్లేయర్,ఉత్తమ స్ట్రైకర్,ఉత్తమ డిఫెండర్ ట్రోఫీలను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, క్రీడలు ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,యువత చెడు మార్గంలో వెళ్ళకుండా ఇలాంటి టోర్నమెంట్ లు నిర్వహించిన నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నన్ నర్సింహన్,కదిర్వన్, జయప్రకాష్,వేణు గోపాల్ రెడ్డి,రామ్,ప్రేమ్, శ్యామ్,హయత్ తదితరులు పాల్గొన్నారు.





# దళిత జర్నలిస్టులకు అండగా ప్రభుత్వం

- కార్మిక గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి.
- దళిత జర్నలిస్ట్ ఫోరం డిమాండ్స్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా.
- సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెల గద్దర్.
- 10వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.
- -దళిత జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపకులు కాశపోగు జాన్.




**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 20ప్రతి నిది**

దళిత జర్నలిస్ట్ ఫోరం డిమాండ్స్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మీ సమస్యలన్నీ పరిష్కారం అయ్యే విధంగా చూస్తారని, కార్మిక గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం హైదరాబాదు రవీంద్ర భారతిలో దళిత జర్నలిస్ట్ ఫోరం 10వ రాష్ట్ర మహాసభలకు మంత్రి వివేక్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా సంస్కృతిక శాఖ సారథి చైర్ పర్సన్ డా. వెన్నెల గద్దర్, టూరిజం సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు ఎల్లన్న , కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్, ఓయూ ప్రొ. డా. మేడి రమణ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. పిడమర్తి రవి, ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, దళిత జర్నలిస్ట్ ఫోరం గౌరవ సలహాదారులు కృష్ణారెడ్డి, ఏ.జి.పి మునగరి కృష్ణ, ఏఐసీసీ నాయకులు కేతూరి వెంకటేష్, దరువు ఎల్లన్న,ఓయూ నాయకులు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ కరణ్ సింగ్, దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు కాశపోగు జాన్, రాష్ట్ర నాయకులతో కలిసి, మంత్రి వివేక్ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి కాక వెంకటస్వామి ఎంతో అభివృద్ధి చేశారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా తను కూడా దళిత జాతి అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. దళిత జర్నలిస్ట్ ఫోరం సభ్యులకు తను అండగా ఉంటారని ఏ అవసరం ఉన్న తనను సంప్రదించాలని తెలిపారు. వెన్నెల గద్దర్ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, నిష్పక్షపాతంగా వార్తలు రాస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరేవేసే కలం యోధులందరికీ, దళిత జర్నలిస్ట్ ఫోరం 10వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దరువు ఎల్లన్న మాట్లాడుతూ దళిత జర్నలిస్టులుగా మీరు పని చేస్తున్న ప్రాంతాలలో దళితులపై దాడులు,అత్యాచారాలు జరిగితే వార్తలు రాసి వారికి అండగా నిలవాలన్నారు. గతంలో మీడియా మొత్తం అగ్రకులాల చేతిలో ఉండడంతో దళితులకు అన్యాయం జరిగితే ఎక్కడ వార్తలు కనిపించేవి కావు. ఇప్పుడు మీడియా రంగం విస్తరించి సోషల్ మీడియా, డిజిటల్ మీడియా, ఆన్లైన్ పత్రికలు, సెల్ ఫోన్ ఆయుధం లాంటి అవకాశాలు పెరిగాయన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన బావ ప్రకటన స్వేచ్ఛ హక్కు ప్రకారం వార్తలు రాస్తూ సమాజంలో వివక్షత, అణచివేత ఎక్కడ ఉన్న దళిత ఉద్యమాలకు ఆత్మగౌరవంతో దళిత జర్నలిస్టులు ఐక్యంగా అండగా నిలవాలని తన మాట పాటలతో క్లుప్తంగా వివరించారు. దుర్గం భాస్కర్ మాట్లాడుతూ దళిత జర్నలిస్టులు దళిత, తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది ఉద్యమకారులకు అండగా నిలుస్తూ వారు ఏనలేని పాత్ర పోషించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన అక్షరజ్ఞానంతో మీ పెన్నులను గన్నులుగా చేసి సమాజంలో జరిగే అణిచివేత, వివక్షత, అంటరానితనం పై యుద్ధం చేయాలన్నారు. మీడియా రంగంలో కూడా కుల వివక్షత ఉందని అగ్రకుల జర్నలిస్టులకు పదోన్నతులు, ఉన్నత పదవులు లభిస్తాయని దళిత జర్నలిస్టులు కింది స్థాయిలోనే పని చేస్తున్నారు. అగ్రకుల జర్నలిస్టులు ఎన్నో ఆస్తులు సంపాదించుకుంటే దళిత జర్నలిస్టులు, ఉద్యమకారులు అనారోగ్య సమస్యలను సంపాదించుకున్నారు. రాజ్యాంగ పరిరక్షణ ద్వారానే మనందరికీ రక్షణ అన్నారు. ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంలో విలేకరుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ జర్నలిస్టులను మెమొంటోస్ తో ఘనంగా సత్కరించారు. మంత్రి వివేక్ జర్నలిస్టులకు బ్యాగులను అందజేశారు. జాతీయ అధ్యక్షులు కాశపోగు జాన్, కమిటీ సభ్యులతో కలిసి ముఖ్య అతిథులను ఘనంగా శాలువా మమెంటోస్ తో ఘనంగా సన్మానించారు. దళిత జర్నలిస్ట్ ఫోరం సభ్యులకు ప్రతి ఒక్కరిని శాలువతో సన్మానించి, మెమొంటో, సర్టిఫికెట్, బ్యాగ్ లను అందజేశారు. కళాకారుల ఆటపాటలు ఎంతో చైతన్యాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్ట్ ఫోరం తెలుగు రాష్ట్రాల వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్, తెలంగాణ వర్కింగ్ కార్యదర్శి ధనుష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల ఎల్లేష్, జగత్ ప్రకాష్, యాదగిరి, కర్రోళ్ల అన్నమ్మ, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు దొమ్మాటి శివకుమార్, సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు పుట్ట రాజు, జర్నలిస్టులు శ్రీరాముల సుధాకర్, బొల్లం రాజేష్, ర్యాకం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# ఎం ఆర్ పి యస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ల ముట్టడి విజవంతం

- గ్రామ యం ఆర్ పి యస్ అధ్యక్షులు ముక్కర నాగరాజు
- గ్రామ ఉపాధ్యక్షులు కేశపురం పెద్దులు

**సిద్ధిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :** రాష్ట్ర యం పి యస్ పిలుపు మేరకు పెన్షనడ్ల పెంపు కొరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ల ముట్టడి భాగంగా జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామంలో పంచాయతీ ఎంపీడీఓ రామిరెడ్డి పంచాయతీ సెక్రటరీ సతీష్ కి యం ఆర్ పి యస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం ఆర్ పి యస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలోకి రాగానే వృద్యప్యం పెన్షన్ బీడీ కార్మికులు ఒంటరి మహిళా ల పెన్షన్ వికలాంగుల పెన్షన్ గీత కార్మికులు పెన్షన్ పెనుస్తానన్న పెన్షన్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలనుండి గడుస్తున్న ఇంత వరకు పెంచలేదని లేకుంటే మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో యం ఆర్ పి యస్ అధ్యక్షులు ముక్కెర నాగరాజు ప్రధాన కార్యదర్శి కేశపూరం పెద్దులు చిలుకూరి మధుసూదన్ రెడ్డి యం ఆర్ పి యస్ నాయకులు ఆకారం మహేష్ ముక్కెర రమేష్ బాబు ప్రశాంత్ సురేష్ మల్లేశం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.







# త్వరలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కి ముఖ్యమంత్రి రాక

- సందర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**నంగునూర్ సెప్టెంబర్ 20 (సిద్దిపేట పవర్)**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మెట్ట గ్రామంలో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీనీ శనివారం రాష్ట్రవ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తో కలిసి సందర్శించి ట్రయల్ రన్ ద్వారా జరుగుతున్న ముడి పామాయిల్ ఉత్పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలోని అత్యాధునిక యంత్రాలతో కూడిన యంత్రాలతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచేలా నర్మెట్టలో అయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ని నిర్మించాం.త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించి, ఫ్యాక్టరీ వద్ద రాష్ట్రంలోని లక్షమంది ఆయిల్ ఫామ్ రైతులతో సభ నిర్వహిస్తాం రాష్ట్ర మంత్రిగా మొదటి సంతకం ఈ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించినది చేశాను ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపి నిధులకు ఎక్కడ సమస్య రాకుండా చూశారు. జిల్లా అధికార యంత్రాంగం మరియు ఆయిల్ ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ నిర్మాణ వేగంగా జరిగేలా చూశారు అధిక వర్షాలతో మధ్యలో కొంత అంతరాయమైన పనులు వేగంగా జరిగాయి అని అన్నారు మన దేశం ప్రతి సంవత్సరం వంట నూనె కోసం లక్ష కోట్ల రూపాయలను ఇతర దేశాలకు చెల్లిస్తుందని అన్నారు కేవలం మూడు శాతం నూనె మాత్రమే మన దేశంలో తయారవుతుంది అని అన్నారు ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇక్కడ ఆయిల్ రిఫైనరీ కూడా నిర్మిస్తున్నామని చెప్పారు కల్తీ లేని స్వచ్ఛమైన వంట నూనె ఇక్కడ ఉత్పత్తి అవుతది అని చెప్పారు ఎలాంటి పొల్యూషన్ రాకుండా పామాయిల్ గింజల పిప్పి తో 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది అని చెప్పారు దీని ద్వారా ఫ్యాక్టరీకి విద్యుత్ ఇబ్బందులు ఉండవు గింజల నుంచి కూడా ఆయిల్ ను ఉత్పత్తి చేస్తున్నాము. దాంతో రైతులకు మరింత ఆదాయం సమకూర్తుంది అని చెప్పారు ఈ ఫ్యాక్టరీలో ఓ.ఇ.ఆర్ కూడా అధికంగా ఉండడంతో భవిష్యత్తులో ఇక్కడ నిర్ణయించే ధరను నిర్ణయించి దేశంలోని ఆయిల్ ఫామ్ రైతులకు చెల్లించడం జరుగుతుంది. సిద్దిపేట జిల్లా దక్కన్ పీఠభూమిలో ఎత్తైన స్థానంలో ఉంది రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కేంద్ర స్థానంలో ఉంది కాబట్టి ఎక్కడి నుండైనా సులభంగా ఆయిల్ ఫామ్ గెలలను రవాణా చేయవచ్చు. రైతులకు మూడు రోజుల్లోనే పేమెంట్ చెల్లిస్తున్నాము అని చెప్పారు దేశంలో 13 లక్షల ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగవుతుంది దానిలో సుమారు పది లక్షల ఎకరాలు తెలంగాణ మరియు ఆంధ్ర ప్రదేశ్ లోనే ఉంది. మానవ జన్మ ఉన్నంతవరకు ఆయిల్ ని వాడుతూనే ఉంటారు. కాబట్టి పామాయిల్ రైతులకు డోకా లేదు భయపడకుండా ఆయిల్ ఫామ్ సాగు చేయాలి సాగు చేసే విధంగా అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు ప్రస్తుతం రాష్ట్రంలో 2 లక్షల 79 వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట వస్తుంది. ఈ సంవత్సరంలో మరో లక్ష ఎకరాలు అదనంగా రావాలి రాష్ట్రంలో ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక లక్ష ఎకరాల పామాయిల్ సాగు జరగాలి. ఈ రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల భూమి ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలంగా ఉంది. 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరిగితే మనమే దేశంలో మొదటి స్థానంలో ఉంటాం. ఆంధ్రాలో 40 సంవత్సరాల క్రితం ఆయిల్ ఫామ్ మొక్కలనను నాటడం ప్రారంభించారు. ఇప్పుడు అక్కడ ఐదు, ఆరు లక్షల ఎకరాల్లో సాగు అవుతుంది.రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లోనే 6 లక్షల ఎకరాల్లో సాగు చేసి దేశంలోనే నెంబర్ వన్ గా తెలంగాణని నిలపాలి సూచించారు తెలంగాణ రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో నిలవాలనేది మా ఆకాంక్ష. ఉద్యానవన శాఖ రాష్ట్ర డైరెక్టర్ జిల్లా కలెక్టర్లు మరియు జిల్లా అధికారులతో సమన్వయం చేస్తూ మండలాల వారీగా ఆయిల్ ఫామ్ తోటల పెంపకం టార్గెట్ పెట్టి దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలి.అంతర పంటగా కోకో, జాజి లాంటి పంటలు వేసుకోవాలి. పామాయిల్ పంటలలో దిగుబడి తగ్గకుండా వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యానవన అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ దిగుబడి పెంచేలా రైతులకు సూచనలు సలహాలు అందించాలి. కేంద్ర ప్రభుత్వం టన్నుకు 25 వేల రూపాయల ధర చెల్లించాలి అని కేంద్రానికి తెలియజేశాను రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం నిరంతరం పరితపించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సమయానికి అందేలా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారురైతులకు యూరియా అందించేలా కేంద్రంతో ఎప్పుడు మాట్లాడుతూనే ఉన్నారు. జిల్లా కలెక్టర్ హేమావతి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా రైతుల అదృష్టవంతులు ఆయిల్ ఫామ్ పంటను అమ్మకానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థానికంగానే ఫ్యాక్టరీ సిద్ధం అయింది. ప్రభుత్వ ఆదేశాలతో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేశాము. త్వరలోనే ముఖ్యమంత్రి ప్రారంభించుకోబోతున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ రఘునందన్ రావు, ఉద్యానవన శాఖ రాష్ట్ర డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష, జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమా అగ్రవాల్, అయిల్ ఫెడ్ ఎండి. శంకరయ్య, జిల్లా ఉద్యానవనా అధికారి సువర్ణ, ఆయిల్ ఫెడ్, ఉద్యానవన వ్యవసాయ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన సిద్దిపేట జిల్లా విద్యాధికారి డీఐఈఓ రవీందర్ రెడ్డి

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి** జగదేవపూర్ వివిద ప్రభుత్వ కళాశాల ఆకస్మికంగా తనిఖీచేసిన సిద్దిపేట జిల్లా విద్యాధికారి రవీందర్ రెడ్డి రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్బంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ విజయ్ కుమార్ కళాశాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు అందించారు. కళాశాలలో గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం అడ్మిషన్లు మెరుగవ్వడం హర్షించదగ్గ విషయం అన్నారు . ఇంటర్ విద్య కమిషనర్ సూచన మేరకు విద్యార్థులకు యఫ్ ఆర్ యస్ అటెండెన్స్ ఏర్పాటు చేయడమైనది. విద్యార్థుల హాజరు మెరుగయ్యేటట్టు ప్రయత్నం చేయలని తెలియజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంసెట్ కోచింగ్ కోసం ఇంటర్మీడియట్ బోర్డ్ వారి ద్వారా ప్రసారమవుతున్న ఫిజిక్స్ వాలా కాన్ అకాడమీ ల ద్వారా విద్యార్థులకు ఎమ్ సెట్ ,నీట్ , ఐఐటీ లాంటివి ప్రిపేర్ చేయించాలని పేద విద్యార్థులను సక్రమ మార్గంలో నడిపించి ఉన్నత పౌరులు గా తీర్చిదిద్దే బాధ్యత మీపైనే ఉందని అధ్యాపకులకు అనేక విషయాలు తెలియజేశారు. కళాశాలలో జరుగుతున్న స్పోర్ట్స్ గేమ్స్ ను సందర్శించి విద్యార్థులకు తగు సూచనలు అందించారు. ఆటల్లో చదువులో రాణించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు కళాశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు తెలియజేశారు.



# ఉద్యోగ పదవీవిరమణ అభినందన సభ

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :** జగదేవపూర్ మండల కేంద్రంలోని యస్ వి ఫంక్షన్ హల్ లో జగదేవపూర్ విద్యాధికారి ముచ్చేంతలా రాధ మాధవ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యతిధిగా కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి డి ఈవో హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పదవి విరమణ అబినందన సభ కు కృషి చేసిన సర్వశికక్షణ ఉద్యోగులు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృషి చేసినందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు వస్తారు కాబట్టి ఉపధ్యాయు మండలని జిల్లాలో ముందుంచాలని ప్రభుత్వ పాఠశాలను ప్రతి ఉపాధ్యాయులు కృషి చేసి ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా కృషి చేయాలనీ అన్నారు. అదేవిధంగా మండల విద్యాధికారి అష్టయురాగ్యలతో వర్ధిలలాని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధారసుపల్లి శశిధర్ శర్మ గజ్వెల్ మండల పి ఆర్ టి యు అధ్యక్షులు వంటేరు నారాయణ రెడ్డి జగదేవపూర్ మండల పి ఆర్ టి యు అధ్యక్షులు చిలుకూరి వెంకట్రాంరెడ్డి మండల ప్రధాన కార్యదర్శి వంటేరు శ్రీనివాస్ రెడ్డి టీటి పి య యఫ్ అధ్యక్షులు శంకర్ సత్తయ్య వివిధ ఉపాధ్యాయ సంఘాలు సర్వే శిక్షణ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రైతులు పంట వేసిన వివరాలు తెలియజేయాలి

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :** జగదేవపూర్ మండలంలో డిజిటల్ క్రాప్ బుకింగ్ ద్వారా పంటల నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వసంతరావు గొల్లపల్లి గ్రామంలో పరిశీలించారు. రైతులందరూ తాము వేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవడానికి సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారికి తెలియజేయాలని సూచించారు. పత్తి వేసిన రైతులందరూ కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్వీయ నమోదు చేసుకోవాలని తెలిపారు. తద్వారా పత్తి అమ్మకానికి సులభం అవుతుందని అన్నారు. ఈ వానాకాలంలో జగదేవ్పూర్ మండలంలో పత్తి 14230 ఎకరాలలో, వరి 10028 ఎకరాలలో, మొక్కజొన్న 225 ఎకరాలలో, కంది 58 ఎకరాలలో, మరియు కూరగాయలు 155 ఎకరాలలో సాగవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఖలీల్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ పండుగ ప్రారంభం

- సుప్రసిద్ధ చిత్రకారులు రుస్తుం

తెలంగాణ అస్తిత్వం, బతుకమ్మ ప్రారంభ పండుగను పురస్కరించుకొని నేడు రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో బతుకమ్మ క్యాన్వాస్ చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం లాంచనంగా ప్రారంభిచారు. పండుగలు సమాజాలను కళావంతం చేస్తాయి. ప్రారంభ బతుకమ్మ బొడ్డెమ్మ పండుగ రంగురంగుల పువ్వుల్లా కలిసిమెలిసి ఐక్యంగా బతుకమ్మా అనే సందేశాన్ని ఆడబిడ్డలు ఆట పాటల రూపకంగా తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటుతారని శాంతి సామరస్యాలతో ఉండాలని మానవతా చిత్రకారులు రుస్తుం తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ ఏ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, నేచర్ ఆర్టిస్టు



రుబీనారుస్తుం ఎండి సాధిక్, రహీం, అనిత, డిబి రజిత, శంకర్, శ్రీను. సునీత, సరితా తదితరులు పాల్గొన్నారు



# ప్రకృతి పువ్వుల పండుగ సంప్రదాయాలకు ప్రతీక

- వెయ్యేళ్ళనాటి నిరసనోద్యమ పండుగ
- బృహతమ్మా ... బతుకమ్మ
- నాటి బృహతమ్మ పండుగే నేటి బతుకమ్మ పండుగ
- ఈ నెల 21 వ తేదీ నుంచి బతుకమ్మ ఉత్సవాలు

(కత్తుల లక్ష్మారెడ్డి, సిద్దన్నపేట)







**'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో**
**బంగారు బతుకమ్మ ఉయ్యాలో**
**కలవారి కోడలు ఉయ్యాలో**
**కలికి కామాక్షి ఉయ్యాలో**
**కడుగుచున్నది పప్పు ఉయ్యాలో**
**కడవలో పోసి ఉయ్యాలో**
**అప్పుడే వచ్చెను ఉయ్యాలో**
**ఆమె పెద్దన్న ఉయ్యాలో**
**కాళ్లకు నీళ్ళిచ్చి ఉయ్యాలో**
**కన్నీళ్లు నింపే ఉయ్యాలో**

...అంటూ తెలంగాణలోని పల్లెలు పట్టణాలలో ఆడ పడుచుల ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ బతుకమ్మ. ఈ నెల 21వ తేదీ నుంచి తొమ్మిది రోజులపాటు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ప్రతి ఏటా భాద్రపద అమావాస్య నుంచి వేడుకలు మొదలై ఆశ్వీయుజ శుద్ధ అష్టమి వరకు కొనసాగి దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

**సంప్రదాయాలకు ప్రతీక**

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను మహిళలు విశిష్ట వేడుకగా జరుపుకుంటారు. గౌరీదేవిని గౌరమ్మగా బతుకమ్మ రూపంలో ప్రత్యక్ష దైవంగా కొలుస్తారు. ఇందుకోసం తంగేడు గునుగు, గడ్డిపూలు, గుమ్మడి, కట్లెపూలు, బంతి తదితర అందుబాటులో ఉండే పువ్వులన్నింటిని తెచ్చుకొని సిద్ధంగా ఉంచుకుంటారు.

**పేర్చడం ఇలా...***

ఈ పూలను ఎత్తె(వెదురు) ఈ నెలతో గానీ, సిబ్బి తీగలతో గానీ అల్లిన సిబ్బిలో లేదా తాంబాలంలో బతుకమ్మను పేరుస్తారు. కింద గుమ్మడి ఆకులను పరిచి దానిపై తంగేడు పూలు పెడతారు. వాటిపై రంగురంగుల పూలను రంగుల్లో ముంచిన గునుగు, గడ్డి పూలను వరుసగా పేర్చి శంఖంలా తయారు చేస్తారు. అడుగు నుంచి పై వరకు పూల దొంతరల మధ్య ముద్ద బంతి, పోక బంతి, రుద్రాక్షపూలతో అలంకరిస్తారు. పైన శిఖరం మీద గుమ్మడి పువ్వులో ని అండాశయాన్ని గౌరమ్మగా భావించి ఉంచుతారు. దాని పక్కనే పసుపు ముద్దతో చేసిన మరో గౌరమ్మను ఉంచి పూజలు చేస్తారు . ప్రధాన కూడళ్ల వద్ద వెంపలి చెట్టు కొమ్మలు నాటి పసుపు కుంకుమలు చల్లుతారు. సాయంత్రం వేళల్లో దాని చుట్టూ బతకమ్మలు ఉంచి తమతో తెచ్చుకున్న పూలను ఒక్కొక్కటిగా వేస్తూ...

**"ఒక్కేసి పువ్వేసి చందమామ**
**ఒక్క జాము అయ్యే చందమామ**
**శివుడింక రాడాయే చందమామ**
**శివుని పూజలాయే చందమామ"...**

.... అంటూ పదిసార్లు ఒక్కొక్క పువ్వు వేసి శివుని ప్రార్థిస్తారు.

**పాటలు పాడుతూ...**

తమ స్థాయికి తగిన పట్టు పితాంబరాలు ధరించిన మహిళలు చేతులను వెనుకకూ, ముందుకు కదిలిస్తూ ఒక లయ ప్రకారం చప్పట్లు కొడుతూ, వొంగుతూ లేస్తూ లయబద్ధంగా కుడి నుంచి ఎడమవైపు అడుగు లేస్తూ బతుకమ్మ పాటలు పాడుతూ వలయాకారంగా బతుకమ్మల చుట్టూ తిరుగుతారు. తమ జీవితాల్లోని ఒడిదొడుకులనే పాటలుగా మలిచి పాడుతూ ఆడతారు. పేద, ధనిక తేడాలు మరచి అన్ని స్థాయిల వారితో ఊరు ఊరంతా కోలాహలంగా ఉంటుంది. ఏ ఆడపడుచు నోట విన్నా బతుకమ్మ పాటలే వినిపిస్తుంటాయి. గ్రామీణ ఆచార వ్యవహారాలు దైనందిన జీవితంలోని కష్టనష్టాలకు ఈ పాటలు అద్దం పడతాయి. బతుకమ్మ పాటల్లో పుట్టింటి ప్రేమలు అత్తగారింటి సంగతులు, సామాజికాంశాలు మిళితమై వాస్తవాలను కళ్ళ ముందు ఉంచుతాయి. పెతరామాస నుంచి బతుకమ్మ ప్రారంభమయ్యే రోజును "ఎంగిలి పూలు" గా పిలుస్తారు. వరుసగా తొమ్మిది రోజులు ఆడకూడదనే నమ్మకంతో ఆరో రోజును "అర్రెం"గా భావించి బతుకమ్మలను పేర్చరు. ప్రతిరోజు చీకటి పడే వరకు బతుకమ్మలను ఆడిన తర్వాత ఆయా గ్రామాలలోని చెరువులు కుంటలలో నిమజ్జనం చేస్తారు. నిమజ్జనం చేసే ముందు బాధతో...

**"తంగేడు పూవుల్ల చందమామ**
**మల్లెన్నడొస్తావు చందమామ**
**గునుగు పూవుల్ల చందమామ**
**బతుకమ్మ పోతుంది చందమామ**
**పోతే పోతివి చందమామ**
**మల్లెన్నడొస్తావు చందమామ**
**ఏడాదికోసారి చందమామ**
**ఆడుకుంటూ వస్తా చందమామ"**

.... అంటూ బతుకమ్మను సాగనంపుతూ పిండితో చేసిన ప్రమిదలలో నూనె పోసి బతుకమ్మలపై ఉంచి జ్యోతులు వెలిగిస్తారు. అనంతరం పసుపు గౌరమ్మను తీసుకుని బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. గౌరమ్మగా చేసిన పసుపు ముద్దను వాయనంగా స్వీకరిస్తారు. వాయనాలిచ్చుకుంటూ...

**'ఉసికెలో పుట్టే గౌరమ్మా**
**ఉసికెలో పెరిగే గౌరమ్మా**
**కుంకుమల పుట్టే గౌరమ్మా**
**కుంకుమల పెరిగే గౌరమ్మా**
**పసుపుల పుట్టే గౌరమ్మా**
**పసుపుల పెరిగే గౌరమ్మా'...**

అంటూ పాటలు పాడి తమతో తెచ్చుకున్న ఫలహారాలను సద్దులను పంచుకుని ఆరగిస్తారు.

బతుకమ్మా' దీవెనయే బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ఆచార వ్యవహారాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగ ఆవిర్భావానికి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. చోళ వంశానికి చెందిన ధర్మాంగుడు సత్యవతి అనే రాజదంపతులకు చాలా కాలం పాటు సంతానం కలగలేదు. వారు చేసిన నోములతో వందమంది కొడుకులు పుట్టినా వారంతా యుద్ధంలో చనిపోతారు. దీంతో విషాదాన్ని తట్టుకోలేక రాజదంపతులు అడవికి వెళ్లి చేసిన తపస్సుకు లక్ష్మీదేవి ప్రత్యక్షమై వారి బిడ్డగా పుడతానని వరం ఇస్తుంది. ఈ మేరకు పుట్టిన బిడ్డ కలకాలం బతకాలని ఋషులు 'బతుకమ్మ' అని నామకరణం చేస్తారు. బతుకమ్మ పెరిగి పెద్దదై చక్రాంకునిగా పుట్టిన శ్రీహరిని(శ్రీ మహావిష్ణువును) పెళ్లి చేసుకున్నట్లుగా కథ ప్రచారంలో ఉంది. అప్పటినుంచి చోళ రాజ్యంలో బతుకమ్మ సంక్షేమం కోసం పండుగ చేసుకోవడం ఆనవాయితీగా మారిందని, 'బతుకమ్మా ' అనే దీవెనయే బతుకమ్మగా ప్రసిద్ధి చెందింది. శ్రీ మహావిష్ణువు చక్రాంకుడి పేరుతో బతుకమ్మను వివాహమాడడంతో అప్పటినుంచి జానపదులు ' బతుకమ్మ 'ను లక్ష్మీదేవిగా పూజిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో ఈ వృత్తాంతాన్ని ..

**శ్రీ లక్ష్మీదేవియు ఉయ్యాలో**
**సృష్టి బతుకమ్మాయే ఉయ్యాలో**
**పుట్టిన రీతి చెప్పే ఉయ్యాలో**
**భట్టు నరసింహ కవి ఉయ్యాలో**
**ధరచోళ దేశము ఉయ్యాలో**
**ధర్మాంగుడను రాజు ఉయ్యాలో**
**ఆ రాజు భార్యయు ఉయ్యాలో**
**ఆది సత్యవతి యండ్రు ఉయ్యాలో**
**నూరు నోములు నోమి ఉయ్యాలో**
**నూరు మందిని గాంచే ఉయ్యాలో**
**వారు శూరులై ఉయ్యాలో**
**వైరులచే మృతులైరి ఉయ్యాలో**
**..అంటూ ఉయ్యాల పాటగా పాడిన తర్వాతనే మిగిలిన పాటలు పాడుతారు.**

**బతుకమ్మగా మారిన కాకతమ్మ పూజ**

'బతుకమ్మా' అనే దీవెనతో బతుకమ్మగా మారిన ఈ పండుగ తెలంగాణలో మొట్టమొదట కాకతమ్మ పూజగామెలుగొందింది. కాకతమ్మ పూజయే బతుకమ్మగా మారిందని చారిత్రకుల అభిప్రాయం. కాకతమ్మ ఉత్సవాలు శాలివాహన శకం 1185 రుధిరోద్గారి నామ సంవత్సరం ఆశ్వీజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యాయని అంచనా. కాకతమ్మ (కాకతీదేవి) కాకతీయ గణానికి కుల దేవత. ఆర్య క్షత్రియ గోత్రాల్లో ఒకటైన కాకతీయ గణం వేద కాలం నుంచి ప్రసిద్ధి చెందింది. కాకతీయ వంశం వారసులైన చాళుక్యులు రాజ్యాలను ఏలుతున్న కాలం నుంచి కాకతమ్మ గురించి రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. కాకతీయుల కాలంలో కాకతమ్మ ఉత్సవాలు బతుకమ్మ పండుగగా మారి తెలంగాణలో బహుళ ప్రచారం పొందాయి.

**జానపద సంస్కృతికి ప్రతీక**

బతుకమ్మ పండుగ తెలంగాణలో జానపద సంస్కృతికి ప్రతీకగా నిలుస్తున్నది. ఈ పండుగ ఆవిర్భావం పై ఆసక్తికరమైన జానపద కథ ప్రచారంలో ఉంది. పూర్వం కాపు(రైతు) దంపతులకు ఆరుగురు కొడుకులు పుట్టినప్పటికీ అందరూ పురిట్లోనే చనిపోయారట. ఏడో కాన్పులో కుమార్తె పుట్టడంతో బతుకమ్మ అని పేరు పెట్టారు. అనంతరం వారికి ఇంకో కొడుకు పుట్టాడట. యుక్త వయసు వచ్చాక బతుకమ్మకు పెళ్లి చేసి జరిపించి అత్తవారింటికి పంపిస్తారు. కొన్నాళ్ల తర్వాత బతుకమ్మ తన సోదరుడిని చూసేందుకు పుట్టింటికి వెళ్లి, తన మరదలితో కలిసి చెరువులో స్నానం చేసేందుకు వెళుతుంది. చెరువు గట్టు పైన దుస్తులు పెట్టి చెరువులో దిగి స్నానం చేసి వచ్చేసరికి గాలివాటం వల్ల ఇద్దరి దుస్తులు కలిసి పోయాయట. పొరపాటున ఒకరి దుస్తులు ఒకరు ధరించారు. దీంతో ఆడపడుచునైన తన దుస్తులు ఎందుకు ధరించావని బతుకమ్మ తన మరదలిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆవేశానికి లోనైన మరదలు బతుకమ్మను గొంతు నులిమి చంపి, చెరువు గట్టున పాతి పెట్టి ఇంటికి వెళుతుంది. అదే రాత్రి తన భర్తకు బతుకమ్మ కలలో కనిపించి తనను తీసుకెళ్లాలని వేడుకుంటుంది. మరునాడు ఆమె భర్త బతుకమ్మను తీసుకొచ్చేందుకు అత్తగారింటికి వెళతాడు. బతుకమ్మను పాతిపెట్టిన చెరువుగట్టు వద్దకు అతను చేరుకునేసరికి అంతకు ముందెన్నడూ చూడని, కనిపించని తంగేడు చెట్టు కనిపిస్తుంది. ఆశ్చర్యంతో ఆ పూలను తెంపేందుకు ప్రయత్నించగా, ఆ చెట్టు పాపిష్టి మరదలు తనను చంపి పాతి పెట్టింది అని చెప్పిందట. ప్రతి ఏటా తంగేడు పూలతో బతుకమ్మను పేర్చి పైన గౌరమ్మను నిలిపి పూజ చేసి చెరువు గట్టున ఆడిన తర్వాత నీటిలో విడిచి పెట్టాలని కోరిందట. బతుకమ్మ భర్త ఈ మేరకు ముత్తయిదువులకు చెప్పి వారి ద్వారా బతుకమ్మ కోరికను తీర్చే వాడట. అప్పటి నుంచి ఆడపడుచులు ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని చెబుతారు.

**మహిషాసుర మర్ధనంతో...**

లోక కంటకుడైన మహిషాసురుడిని చంపిన గౌరీ దేవి అలసిపోయి ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి నాడు మూర్ఛపోయిందని ఆమెను స్పృహలోకి తెచ్చేందుకు స్త్రీలంతా భక్తి తో పాటలు పాడడంతో ఐదో రోజు లేచిందని పురాణ గాథ ప్రచారంలో ఉంది. మహిషాసుర మర్ధని తేరుకునేందుకు 'బతుకమ్మా ' అంటూ అనేక రకాలుగా వేడి నందున ' బతుకమ్మ ' అయ్యిందని జానపద అభిప్రాయం.

**బృహదమ్మే... బతుకమ్మా?**

పెత్తరామాస నాడు ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై ఆశ్వీయుజ శుద్ధ అష్టమి(దుర్గాష్టమి) నాడు సద్దుల బతుకమ్మతో సద్దుమణిగే ఈ పండుగలో ఎన్నో పాటలు, కబుర్లు, జ్ఞాపకాలు విన్నప్పటికీ బతుకమ్మ గురించి ఇంకా తెలుసుకోవాల్సింది మిగిలే ఉంటుంది. ఇప్పటివరకు బతుకమ్మ పండుగ మూలాలు వెలుగులోకి రాలేదు. కాకతీయుల కాలం నుంచి బతుకమ్మ పండుగ ఉందని చెబుతున్నప్పటికీ అంతకుముందు నుంచే ఈ పండుగ మూలాలు ఉన్నట్లు తెలుస్తోంది. కాకతీయుల కాలానికి వందల సంవత్సరాల ముందు నుంచి తెలంగాణ ప్రజలు ఇప్పటికీ కొనసాగిస్తున్న నిరసన ఉద్యమం బతుకమ్మ అని తెలుస్తున్నది. చరిత్ర పరిశోధకుల పరిశీలనల మూలాల్లోకి వెళితే....

తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన వేములవాడ చాళుక్య రాజులు మొదట రాష్ట్రకూటులకు సామంతులు. చోళులకు రాష్ట్ర కూటులకు యుద్ధం జరిగితే వేములవాడ చాళుక్యులు రాష్ట్ర కూటుల వైపు యుద్ధం చేసేవారు. రాష్ట్రకూటుల సామంతుడైన రెండో తైలపుడు క్రీ.శ. 973 లో చివరి రాష్ట్ర కూట రాజు రెండో కర్కుడిని(కర్కుడు2) ను ఓడించి స్వతంత్ర కళ్యాణి చాళుక్య రాజ్యం స్థాపించాడు. ప్రస్తుత తెలంగాణ ప్రాంతం ఇతడి ఆధీనంలో ఉండేది. తైలపుడు మరణించిన తర్వాత అతని కుమారుడు సత్యాశ్రయుడు క్రీ.శ.997లో రాజయ్యాడు. అప్పటికే వేములవాడ చాళుక్య రాజ్యంలోని వేములవాడ రాజేశ్వరాలయం ప్రసిద్ధి చెందింది. తెలంగాణ ప్రజల ఇష్టదైవంగా రాజేశ్వరుడు ఇక్కడ నిత్య పూజలు అందుకునేవాడు. చోళ రాజైన పరాంతక సుందర చోళుడు రాష్ట్రకూటల దండయాత్రను ఎదుర్కోలేక కష్టాల్లో ఉన్నాడు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునే దైవంగా రాజరాజేశ్వరుని గురించి తెలుసుకున్న పరాంతక సుందర చోళుడు రాజరాజేశ్వరుడి భక్తుడిగా మారాడు. తన రెండో కుమారునికి రాజరాజ అనే పేరు పెట్టుకున్నాడు. పరాంతక సుందర చోళుడు తన కుమారునికి తన ఇష్టదైవం అయిన రాజరాజేశ్వరుడి పేరు పెట్టుకున్నట్లు రెండో అరికేసరి (930 55)వేయించిన ' దాన శాసనం 'లో పేర్కొన్నారు. రాజరాజ చోళుడు క్రీ.శ.9851014 కాలంలో రాజ్య పాలన చేశాడు. ఇతని కుమారుడైన రాజేంద్ర చోళుడు సైన్యాధ్యక్షుడిగా తొమ్మిది లక్షల సైన్యంతో బీజాపూర్ జిల్లాలోని దోనూర్ వద్ద చాళుక్యల మీద దండయాత్ర చేసి సత్యాశ్రయుడి మీద విజయం సాధించాడు. చాళుక్య సత్యాశ్రయుని క్రీ. శ.1007 నాటి వొట్టూరు(దార్వాడ్) శాసనం ద్వారా ఈ విషయం తెలుస్తున్నది. చాళుక్యులపై సాధించిన విజయానికి గుర్తుగా రాజేశ్వరుడి దేవాలయాన్ని ధ్వంసం చేసి అందులోని బృహత్ శివలింగాన్ని రాజేంద్ర చోళుడు తన తండ్రికి కానుకగా తంజావూరు తీసుకెళ్లాడు. ఈ (బృహదీశ్వరుడి) లింగానికి తంజావూరులో క్రీ.శ. 1006వ సంవత్సరంలో రాజరాజ చోళుడు దేవాలయ నిర్మాణాన్ని ప్రారంభించి, పూర్తి చేసిన తరువాత క్రీ.శ. 1010లో లింగ ప్రతిష్టాపన చేశాడు. బృహదీశ్వర దేవాలయం దక్షిణ భారత దేశంలో ఎత్తైన "కలశం (విమాన గోపురం) తో ఉన్నది. ఈ కలశాన్ని సుమారు 81.28 టన్నులు బరువు కలిగిన నల్లరాతితో చెక్కారు. బృహదీశ్వరాలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించింది. ఈ బృహదీశ్వరాలయాన్ని వేములవాడ చాళుక్య దేశంపై జరిగిన దండయాత్రలో స్వాధీనం చేసుకున్న ధనంతో నిర్మించినట్లు తమిళ శాసనాల్లో చోళ రాజులు ప్రకటించుకున్నారు. వేములవాడ భీమన్న గుడిలోని శివలింగం తంజావూరు లోని బృహదీశ్వరాలయంలోని శివలింగం ఒకే విధంగా ఉండడం ఇప్పటికీ గమనించవచ్చు. దీనికి కారణం అయిన రాజ రాజ చోళుడికి 'తెలింగ కులకాలుడు' అనే బిరుదు కలదు. ఈ బిరుదును రాజరాజు చోళుడు తంజావూరులో నిర్మించిన బృహదీశ్వరాలయంలోని శాసనాల్లో పేర్కొన్నారు. తెలింగ కులకాలుడు అంటే తెలంగాణకు యమ ధర్మరాజు అని అర్థం. వేములవాడ నుంచి శివలింగాన్ని దౌర్జన్యంగా తంజావూరుకు తరలించడం తెలంగాణ ప్రజలకు బాధ కలిగించింది. తెలంగాణ నుంచి లింగాకారమైన శివుడు వెళ్ళిపోయిన తర్వాత ఇక్కడున్న గుడిలో పార్వతిని (బృహదమ్మను) ఊరడించే ప్రయత్నంతో పాటు, చోళులకు తమ నిరసన తెలపడం కోసం పూలతో (సృష్టి) మేరు పర్వతంలా బతుకమ్మను పేర్చారు. దానిపై పసుపు గౌరమ్మను ఉంచి దసరా సందర్భంలో తొమ్మిది రోజులు ఆటపాటలతో పదేపదే తలిచేవారు. చివరగా తిరిగి రమ్మంటూ నీళ్లలో వదలడం ఒక పండుగగా మారింది. తెలంగాణ ప్రజలకు బాధ కల్గించిన ఈ విషయానికి నిరసనగా సృష్టికి కారణ భూతమైన శక్తి రూపాన్ని బృహదమ్మగా(బృహత్ అమ్మ అంటే గొప్ప అమ్మగా)పూజించారు. ఈ బృహదమ్మ నుంచి బతుకమ్మ అనే పేరు వచ్చింది. అందుకే బతుకమ్మ పండుగ అనేది 1000 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నుంచి వస్తున్న ఒక సామూహిక నిరసన ఉద్యమం. శివుడు లేని పార్వతిని ఊరడించడానికి అమ్మవారి పేరు మీద మాత్రమే పాటలు పాడుతారు. దీనికి నిదర్శనంగా...

**"ఒక్కేసి పువ్వేసి చందమామ**
**ఒక్క జాము అయ్యే చందమామ**
**శివుడొచ్చే వేళాయే చందమామ**
**శివుడింక రాకపాయే చందమామ"...**

....అంటూ అమ్మవారి ఊరడింపు పాటను బతుకమ్మను నిమజ్జనం చేసే ముందు పాడటాన్ని చెప్పుకోవచ్చు.

భారతదేశంలో బహుశా మొదటిసారి ఒక అకృత్యానికి, అన్యాయానికి, అహింసా పూర్వక సత్యాగ్రహాలతో నిరసనను తెలిపే ఏకైక ప్రక్రియయే బతుకమ్మ. భారతదేశంలో వెయ్యేళ్ళ పూర్వం అహింసాయుతమైన సత్యాగ్రహానికి పునాది వేసిన ఘనత బతుకమ్మ పండుగకు దక్కుతుంది


**పెత్తందారి పోకడలకు నిరసన**

నవాబులు, భూస్వాముల పెత్తందారితనం ఉన్న ప్రాచీన కాలంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. నవాబులు భూస్వాముల అనుచరుల అకృత్యాలు, దౌర్జన్యాలు దారుణంగా ఉండేవి వీరి అకృత్యాలను తట్టుకోలేక మహిళలు ఆత్మహత్యలు చేసుకునేవారు. ఆత్మహత్యలు చేసుకున్న మహిళలను తలుచుకొని విచారించే తోటి మహిళలు నవాబులు, భూస్వాముల అకృత్యాలు, దౌర్జన్యాలకు నిరసనగా, ఆత్మహత్యలు చేసుకున్న మహిళలకు ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా బతుకమ్మ అంటూ పెద్దల అమావాస్య(పెత్తరమాస) నుంచి తొమ్మిది రోజుల పాటు పాటలు పాడి దీవించేవారు

ఆరాధించే విధానం పాడి పంటలు, జీవనదులు, అటవీ సంపద జానపదుల జీవితంలో సుఖాలకు ప్రతీకలయితే, కరువు కాటకాలు, తుఫానులు, భూకంపాలు కష్టాలకు సంకేతాలు. సుఖాలను పొంది కష్టాలను ఎదుర్కొనేందుకు జానపదులు ప్రకృతిని పూజిస్తారు. ప్రకృతిని ఆరాధించే విధానమే బతుకమ్మగా మారిందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ప్రకృతి ఒడిలో పుట్టి పెరిగిన జానపదులు తమ ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే విధంగా జరుపుకున్న బతుకమ్మ పండుగ తర్వాత కాలంలో తెలంగాణలో ప్రసిద్ధి చెందిందని భావిస్తున్నారు.















**ఔషధ గుణాలతో మేలు**


ప్రకృతి పచ్చగా కళకళలాడుతున్నప్పుడు వచ్చే పువ్వుల పండుగే బతుకమ్మ.

కొమ్మ చెక్కితే బొమ్మరా... కొలిచి మొక్కితే అమ్మరా ... అని తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందేశ్రీ రాసినట్లు కొమ్మన పూసిన పూలు బతుకమ్మ వేడుకల్లో ప్రాముఖ్యం వహిస్తాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో పూల బతుకమ్మ గౌరమ్మ తల్లిగా పూజలు అందుకుంటుంది. పూలతో పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. వినాయక చవితి సందర్భంగా గణపతిని నవరాత్రులలో పూజించినట్లుగా బతుకమ్మను తొమ్మిది రోజులు నిర్వహిస్తారు. వినాయకుడిని గరిక, పత్రి, పూలతో పూజించి చివరి రోజు నిమజ్జనం చేయడం తెలిసిందే. అలాగే బతుకమ్మలను పూలతో అలంకరించి ఏరోజుకారోజు నీటిలో నిమజ్జనం చేస్తారు. దీనివల్ల తంగేడు పూలు, గరిక పూలు,వాటి ఆకులలో ఉన్న ఔషధ గుణాలు నీటిలో కలిసి ఆవిరిగా మారడం వల్ల మానవాళికి మేలు జరుగుతుందని ప్రతీతి. వర్షాకాలంలో కురిసే వానలతో వరదలు పారి చెరువులు కుంటలు నీటితో కళకళలాడుతుంటాయి. ఎక్కడెక్కడి నుంచో వరదలు రావడం వల్ల నీరు కలుషితం అయి అంటు రోగాలు ప్రబలే అవకాశాలు ఎక్కువ. బతుకమ్మలకు ఉపయోగించే పువ్వులు, గౌరమ్మను చేయడానికి ఉపయోగించే పసుపు ఈ నీటిని శుద్ధి చేస్తాయి. పసుపుతో పాటు, బతుకమ్మను పేర్వడానికి ఉపయోగించే పూలలో ఔషధ గుణాలు ఉన్నాయి. ఈ గుణాలు నీటిలో కరిగి మానవాళిని వివిధ వ్యాధులనుంచి రక్షిస్తాయని నమ్ముతారు. బతుకమ్మను పూలతో ఆరాధించడం వల్ల జగత్తుకు మేలు జరుగుతుందని భావిస్తారు.


**పూలలో ఉండే ఔషధ గుణాలు**

**1. తంగేడు:**

తంగేడు చెట్టు శాస్త్రీయ నామం కేశియా అరిక్యులేటా. మొక్క సమూలంలో బీటా సైటోస్టిరాల్, గ్లైకోసైడ్లు ఉన్నాయి.తంగేడు శరీరంలోని వాతం, ఉష్ణం, ప్రకోపాలను తగ్గిస్తుంది. రక్త ప్రసరణను నియంత్రించి క్రమబద్ధీకరిస్తుంది. తంగేడు మొక్క భాగాలను ఉపయోగించి అతిమూత్ర వ్యాధి, గుండె దడ, సంతానలేమి, మధుమేహం, పన్ను నొప్పి, రేచీకటి, కడుపునొప్పి, నోటిపూత వంటి వ్యాధుల చికిత్సలో ఉపయోగిస్తారు. తంగేడు చెక్కను తోళ్ల పరిశ్రమల్లో తోళ్లను శుభ్రం చేసేందుకు వాడుతారు.







# ప్రకృతి పువ్వుల పండుగ సంప్రదాయాలకు ప్రతీక

**2. పట్టుకుచ్చులు**

పట్టుకుచ్చుల పూలకు సీతమ్మ జడ పూలు (సీతమ్మ జడ గంటలు) అని మరో పేరు. కోడి జుట్టు పువ్వులు, ముఖమల్ పువ్వులు, మహారాణి పువ్వులు.... అని చాలా పేర్లతో పిలుస్తారు. ఆంగ్లంలో సెలోసియా అని పిలిచే పట్టు కుచ్చుల పూల మొక్క ప్రతి కొమ్మకూ సన్నాయి ఆకారంలో పూలు పూస్తాయి. వానాకాలంలో మొదలయి ఈ పువ్వులు చలికాలం ముగిసే వరకు కనువిందు చేస్తాయి. సూర్య కాంతి పడినప్పుడు మెరిసి పోతూ ఆకట్టుకునే ఈ పువ్వులు ఎక్కువగా రాణీ రంగులోనూ, ఊదా,ఎరుపు,పసుపు,... వంటి రంగుల్లో దొరుకుతాయి. పాశ్చాత్య దేశాలలో ఎండబెట్టిన పూలను అలంకరణల్లో వాడుతారు. ఆయుర్వేద వైద్యంలో రక్తస్రావ సమస్యలు, గ్యాస్ సంబంధిత ఇన్ఫెక్షన్లు, అతిసారం,తలనొప్పి, జలుబును, ఆస్తమాను తగ్గించే ఔషధంగా ఈ పువ్వులు పనిచేస్తాయి.

**3. గులాబీ:**

గులాబీ పూలను ఆయుర్వేద మందుల్లో విరివిగా ఉపయోగిస్తారు.

**4. కట్ల పూలు:**

కట్లపూల తొడిమలను ఆయుర్వేద మందులలో ఉపయోగిస్తారు. పశువులకు వైద్యం చేసేందుకు వాడుతారు. క్యాన్సర్, నొప్పుల నివారణకు వాడుతారు.

**5. గుమ్మడి:**

బతుకమ్మ సంబరాలలో గుమ్మడి పూలకు ప్రత్యేక స్థానం ఉంది. గుమ్మడి ఆకులతో మొదలుపెట్టి.. గుమ్మడి పువ్వులోని అండాశయాన్ని గౌరమ్మగా భావించి ప్రతిష్టించడంతో పూర్తి చేస్తారు. పక్కనే పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి 'పసుపులో పుట్టిన గౌరమ్మా' అని పాడుతూ పూజిస్తారు. ఎందుకంటే ఈ పువ్వులో సహజంగా గౌరమ్మ కొలువై ఉంటుందని ఆడపడుచుల నమ్మకం. గుమ్మడి పూలతో పాటు, గుమ్మడి ఆకులు, కాయలకు ఔషద గుణాలు ఎక్కువ. అందుకే చాలా ప్రాంతాల్లో వీటిని వంటకాల్లో వినియోగిస్తారు. గుమ్మడి పూవులకు శరీరంలోని ఉష్ణోగ్రతలను సమతుల్యం చేసే ఔషధ లక్షణాలు ఉన్నాయి. జలుబు, దగ్గు, వైరల్ జ్వరాలకు మందుగా వాడుతారు. గుమ్మడి పూలలోని విటమిన్ ఏ, విటమిన్ సి, కాల్షియం, పొటాషియంలు వ్యాధినిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. కణుతులు, మధుమేహం, రక్తపోటు నివారణకు వీటిని ఉపయోగిస్తారు. యాంటీ బ్యాక్టీరియల్ ఏజెంట్ గానూ ఉపయోగిస్తారు.

**6. గునుగు :**

దసరా నాటికి పడ్డ వర్షాలతో బీడు భూముల్లో గునుగు మొక్కలు పూల తివాచీలా పరుచుకుని ఉంటాయి . ఇవి పేరుకు గడ్డి జాతి పువ్వులే కానీ బతుకమ్మ అలంకరణలో అందమంతా వీటిదే. గాలికి ఊగుతూ తెలుపు గులాబీ రంగులతో మెరిసి పోతూ కనువిందు చేస్తాయి. గునుగు పూలను ప్రపంచవ్యాప్తంగా అలంకరణ కోసం ఉపయోగిస్తారు. ఈ పూల మొక్కకు ఔషధ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు దీనిలో పుష్కలంగా ఉంటాయి. యాంటీ ఇన్ ఫ్లమేటరీ లక్షణాలను కలిగి మధుమేహం నివారణలో చురుకుగా పనిచేస్తుంది. వీటి ఆకులు చర్మంపై గాయాలు, పుండ్లను తగ్గించగలవు. గునుగు ఆకు రసాన్ని గాయాలపై పిండి కట్టుగా కడితే గాయాలు తగ్గిపోతాయి. అతిసారం నివారణకు మందుగా వాడతారు. అధిక రక్తపోటుని నియంత్రించగలవు. క్షయ వ్యాధి నివారణకు ఉపయోగిస్తారు. యూరినరీ ఇన్ఫెక్షన్లు, మలబద్ధకం నివారణలోనూ ఈ మొక్క ఉపయోగపడుతుందని ఆయుర్వేదం చెబుతోంది

**7. గడ్డి పూలు:**

గడ్డిపూలు వైరస్ ను అరికట్టడానికి, గాయాలను మాన్పడానికి, బాధా నివారిణి గా ఉపయోగపడతాయి. వీటి ఆకుల రసాన్ని తాజా గాయాలను మాన్పడానికి, రక్తస్రావాన్ని నివారణకు ఉపయోగిస్తారు.

గడ్డి పువ్వులు జీర్ణం చేసే ఔషధ గుణాలను కలిగి ఉంటాయి.

**8. మందార:**

మందార పుష్పాలను ఎండబెట్టి, నూనెలో మరిగించి తలకు రాస్తే నొప్పి తగ్గుతుంది. వెంట్రుకలు తెల్లగా మారకుండా నల్లగా ఉంటాయి.

**9. బంతి:**

బంతిపూలు సుగంధాలు వెదజల్లుతూ కంటికింపైన పసుపు, నారింజ రంగుల్లో ముచ్చట గా కనిపిస్తాయి. అలంకరణల్లోనూ వీటిదే పైచేయి. బంతిపూలు సూక్ష్మ క్రిములను నాశనం చేస్తాయి. వీటితో సూక్ష్మ క్రిములతో వచ్చే వ్యాధులను అరికట్టవచ్చు. యాంటీ సెప్టిక్ గా సమర్థవంతంగా పని చేస్తాయి. ఈ పూలతో చేసిన టీ శరీరంలో వేడిని తగ్గిస్తుంది. కిడ్నీలో రాళ్ళను కరిగించే లక్షణాలు వీటిలో ఉన్నాయి. ఈ పూలతో చేసిన తైలాన్ని అధిక రక్తస్రావాన్ని తగ్గించడానికీ, జుట్టు పెరగడానికీ వాడతారు. బంతిపూల రేకల నుంచి సారం తీసి ఫేస్ క్రీములు సీరమ్ లు... వంటి సౌందర్య ఉత్పత్తులు తయారు చేస్తున్నారు

**10. తామర పూలు:**

ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతూ అందంగా విచ్చుకునే తామర పూలు ... పూజలకి విశిష్టమైనవిగా పేర్కొంటారు. లక్ష్మీదేవి నివాసమని భావిస్తారు. వీటికి బతుకమ్మను పేర్చడంలో ప్రాధాన్యత ఇస్తారు. తెలుపు, ఎరుపు, ఊదా, గులాబీ, ... తదితర రంగుల్లో తామర పూలు కనువిందు చేస్తాయి. తామర పూలు, కాడలు, గింజలూ అన్నింటిలోనూ పోషకాలు, ఔషధ గుణాలూ పుష్కలంగా ఉంటాయి. తామర పూలు లినోలిక్ యాసిడ్ ప్రోటీన్లు ఫాస్ఫరస్, ఐరన్, విటమిన్ బి, విటమిన్ సి లను కలిగి ఉంటాయి. వీటి యొక్క శీతల లక్షణాలు, ఆహ్లాద పరిచే లక్షణాల ఆధారంగా వీటిని ఫేషియల్ కు వాడుతారు. తామర పూలు శరీర వేడిని తగ్గిస్తాయి. రక్తస్రావాన్ని నివారించే గాయాల నుంచి త్వరగా కోలుకునేటట్లు చేస్తాయి. సుగంధ ద్రవ్యాల తయారీకి ఈ పూలను వాడుతారు. మలబద్ధకంతో బాధపడే వారికి తామర తైలం దివ్యౌషధంగా పనిచేస్తుంది. తామర పూలతో చర్మ సంబంధ వ్యాధులను నివారించవచ్చు. తామర పువ్వు రేకులను కుంకుమపువ్వు, కలువ పువ్వులతో కలిపి ముఖానికి రాస్తే మంచి ఫలితం ఉంటుంది.

**11.కనకాంబరాలు.**

నారింజ, పసుపు రంగుల్లోఎక్కువగా లభిస్తాయి. నేరేడు, ఎరుపు, లేత గులాబీ,... వంటి రంగుల్లోనూ లభించే కనకాంబరాలు తేలికగా ఉండి, మూడు నాలుగు రోజుల వరకు తాజాగా కన్పిస్తాయి. వీటిని కేశాలంకరణతో పాటు ఇతర అలంకరణకు వాడుతారు. కనకాంబరం మొక్కల్లో ఔషధ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఆయుర్వేద వైద్యంలో దగ్గు, అల్సర్ నివారణ మందుల్లో వాడుతారు. కనకాంబరాలపై పుణెలోని మోడరన్ కాలేజీ బయోటెక్నాలజీ పరిశోధనలు నిర్వహించింది. ఈ పరిశోధనల్లో సెల్ ఫోన్ పై పేరుకునే బ్యాక్టీరియాను తొలగించే శక్తి వీటికి ఉందని తేలింది.

**12.పోక బంతి పూలు**

చిన్న గ్లోబ్ ఆకారంలో ఉండే పోక బంతి పూలను బొగడ బంతి పూలు, గుండు బంతి పూలు, గ్లోబ్ ఉసిరి, వడమల్లి ...తదితర పేర్లతో ఆయా ప్రాంతాలను బట్టి పిలుస్తారు. ఈ పూలలో లభించే బీటాసైనిన్ సేకరించి క్యాన్సర్ మందుల తయారీలో వాడుతారు. ఈ పూల మొక్కలు, పువ్వులలో ఉండే ఆంథోసైనిన్ లు అతి నీలలోహిత కిరణాలు నుంచి మన శరీరాన్ని రక్షిస్తాయి. దీనిలోని యాంటీ మైక్రోబియల్ లక్షణాలు... దగ్గు, జలుబు, వైరస్ లను అడ్డుకుంటాయి.

**13. రుద్రాక్ష పూలు**

సాయంత్రం వేళల్లో మెచ్చుకునే రుద్రాక్ష పూలను తాజాగా కోసి బతుకమ్మలో పేరుస్తారు. వీటిని చంద్రకాంత పూలనీ, సాయంత్రం పూలనీ పిలుస్తారు. ఇవి ముదురు గులాబీ, పసుపు, ఎరుపు, కాషాయం వంటి ఎన్నో రంగుల్లో పూస్తాయి. వీటిలో రంగులు మార్చేవి, అనేక రంగుల్లో పూసేవి కూడా ఉంటాయి. ఈ పూలకు ఔషధ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా మూత్ర సంబంధిత సమస్యలను నివారించేందుకు, వాపులను తగ్గించేందుకు, గాయాలకు చికిత్స కోసం వినియోగిస్తారు. ఆహార రంగుల తయారీలోనూ, కాస్మెటిక్ డైలుగాను ఉపయోగిస్తారు.

**14. బీర పూలు**

బీర పూల మొక్కల వేర్లను నంజు వ్యాధి నివారించడానికి పాలు పట్టడానికి వాడుతారు. బీర ఆకులను కామెర్ల రోగ నివారణలో ఔషధంగా ఉపయోగిస్తారు .

**15. చామంతి పూలు**

చామంతి పూలలోని యాంటి ఆక్సిడెంట్ చాలా రకాల వ్యాధులను శారీరక రుగ్మతలను నయం చేయడంలోనూ, నివారించడంలోనూ సమర్థవంతంగా పనిచేస్తుంది. ఈ పూలు క్యాల్షియం, మాంగనీస్, ఫోలేట్, ఐరన్, సోడియం, పొటాషియం, ఫాస్ఫరస్, మాంగనీస్, జింకు, కాపర్ వంటి అత్యవసరమైన మినరల్స్ ను కలిగి ఉంటాయి.

**16. దోస పూలు**

దోస పూలు జీర్ణకోశ సంబంధిత వ్యాధులను నివారించడానికి ఉపయోగిస్తుంటారు.

**17. వాము పూలు**

వాము చెట్టు ఆకులు ఆకు పచ్చని రంగులో మందంగా ఉంటాయి. ఈ ఆకులను ముట్టుకుంటే వాము వాసన వెదజల్లుతుంది. ఆకులను నేరుగా తినొచ్చు. వామాకు ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ లను తగ్గిస్తుంది. ఆస్థమా, న్యుమోనియా, దగ్గు, బ్రాంకైటిస్ ల నుంచి ఉపశమనం లభిస్తుందని పరిశోధనల్లో తేలింది . వామాకులో థైమాల్, కార్వకాన్ అనే రసాయన సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల్లో శ్లేష్మాలు తయారు చేసే హిస్టమిన్స్ ఉత్పత్తిని తగ్గిస్తాయి. వామాకును పచ్చడి చేసి తీసుకున్నా, నీటిలో వామాకును మరిగించి తాగినా మంచిదే. వంటల్లోనూ వామాకును వాడుకుకోవచ్చు.వామ పువ్వులు గుత్తులు గుత్తులుగా ఉంటాయి. వీటి నుంచి విత్తులు వస్తాయి. వాము శరీరంలో వాతాన్ని హరింపజేస్తుంది. శూలలను తగ్గిస్తుంది. జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. కడుపు ఉబ్బరం, ప్లీహవృద్ధిని తగ్గిస్తుంది. వాంతులను తగ్గిస్తుంది. గుండెకు కూడా అత్యంత ఉపయోగకారి.

ఇవేకాక వ్యాధులను దరి చేరనీయని నూరు వరహాలు, సత్యనారాయణ పూలు, బఠానీ, గన్నేరు, కాగితం పూలు వంటి పూలను బతుకమ్మలను అలంకరించేందుకు వాడుతారు.

**తొమ్మిది రోజుల ఫలహారాలు**

తెలంగాణ గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే ప్రకృతితో మమేకమయ్యే సంబరమే బతుకమ్మ పండుగ. ఈ వేడుకలు ప్రతి ఏటా భాద్రపద అమావాస్య... అంటే మహాలయ అమావాస్య(పెద్దల అమావాస్య, పెతరామాస అని కూడా పిలుస్తారు) నాడు ప్రారంభం అవుతాయి. పెతరామాస నుంచి

బతుకమ్మను తొమ్మిది రోజుల పాటు రోజుకో పేరుతో బతుకమ్మను కొలిచి ఆడుతారు. ప్రతిరోజు పూలతో చక్కగా బతుకమ్మను పేర్చి శిఖరం పైన తమలపాకులు ఉంచుతారు. తమలపాకులపై పసుపుతో చేసిన గౌరమ్మను పెట్టి పూజిస్తారు. ఈ తొమ్మిది రోజులూ రకరకాల ప్రసాదాలను నివేదిస్తారు. ప్రతి రోజు బతుకమ్మలను ఆడి నిమజ్జనం చేసిన తర్వాత చెరువుగట్టున మహిళలు తమ వెంట తెచ్చుకున్న ఫలహారాలను పంచుకుని ఆరగిస్తారు. ఒక్కో రోజు ఒక్కో రకమైన ఫలహారాన్ని వినియోగిస్తారు. మహిళలకు క్యాల్షియం ఐరన్ వంటి పోషకాలు ఎంతో అవసరం. ఈ పోషకాలు లభించే ఆహార పదార్థాలనే నైవేద్యాలుగా (ఫలహారాలుగా) తొమ్మిది రోజులు గౌరమ్మకు నివేదిస్తారు. అవి నువ్వులు, బెల్లం, పులిహోర, పెరుగన్నం, పల్లీలు, సజ్జలు, అటుకులు, అట్లు మొదలైనవి. తొమ్మిది రోజులపాటు పేర్చే బతుకమ్మలు, వినియోగించే ఫలహారాల పేర్లు

**మొదటిరోజు:**

ఎంగిలి పువ్వుల బతుకమ్మ . భాద్రపద అమావాస్య రోజు పెద్దలకు బియ్యం ఇచ్చిన తర్వాత బతుకమ్మను పేరుస్తారు. అమావాస్యకు ముందు రోజే రకరకాల పువ్వులను కోసుకొని తీసుకొచ్చి నీళ్లలో వేస్తారు. ఈ పువ్వులతో అమావాస్య నాడు బతుకమ్మ అందుకే ఎంగిలిపూల బతుకమ్మ అని పేరు. ఈరోజు ప్రసాదంగా తులసి ఆకులు, తమలపాకులు, భాగాలు(వక్కలు) సోంపును బతుకమ్మకు నివేదించి ప్రసాదంగా పెడతారు. కొన్నిచోట్ల నువ్వులు, నూకలు, బెల్లం ప్రసాదంగా వాడతారు.

**రెండో రోజు:**

అటుకుల బతుకమ్మ. రెండవ రోజైన ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నాడు రెండు ఎత్తుల్లో(దొంతరల్లో) బతుకమ్మ పేరుస్తారు. ఈరోజు అటుకులు, సప్పడి పప్పు, బెల్లంతో తయారు చేసిన ప్రసాదాన్ని నివేదిస్తారు. ఈరోజు ప్రధానంగా ప్రసాదంలో అటుకులు నివేదిస్తారు కాబట్టి అటుకుల బతుకమ్మ అని పిలుస్తారు.

**మూడో రోజు :**

ముద్దపప్పు బతుకమ్మ. మూడవ రోజు అయిన ఆశ్వీయుజ శుద్ధ విదియ నాడు మూడు ఎత్తుల్లో( దొంతరల్లో) బతుకమ్మ పేరుస్తారు. ముద్ద పప్పు, బెల్లం, పాలతో కలిపి చేసిన వంటకాన్ని ప్రసాదంగా నివేదిస్తారు. అందుకే ముద్దపప్పు బతుకమ్మ అని పిలుస్తారు.

**నాలుగో రోజు:**

నాన బియ్యం బతుకమ్మ. నాలుగవ రోజైన ఆశ్వీయుజ శుద్ధ తదియ నాడు పాలు, బెల్లం, నానేసిన బియ్యంతో ప్రసాదాన్ని నివేదిస్తారు. అందుకే నానబియ్యం బతుకమ్మ అని పిలుస్తారు. ఈరోజు నాలుగు ఎత్తుల్లో(దొంతరల్లో) బతుకమ్మ పేరుస్తారు.

**అయిదో రోజు:**

అట్ల బతుకమ్మ. బతుకమ్మ వేడుకల్లో అయిదవ రోజైన ఆశ్వీయుజ శుద్ధ చవితి నాడు తంగేడు, గునుగు, చామంతి, మందార, బీర తదితర పువ్వులతో అయిదు ఎత్తుల్లో బతుకమ్మ పేరుస్తారు. తంగేడు గునుగు చామంతి మందార బీర తదితర పువ్వులతో అయిదు ఎత్తుల్లో బతుకమ్మ పేరుస్తారు. ఈరోజు బియ్యం నానబెట్టి, దంచి తీసిన పిండితో చేసిన అట్లు (దోశలు) బతుకమ్మకు నివేదిస్తారు. అందుకే అట్ల బతుకమ్మ పిలుస్తారు.

**ఆరో రోజు:**

అలిగిన బతుకమ్మ. బతుకమ్మ వేడుకల్లో ఆరవ రోజైన ఆశ్వీయుజు శుద్ధ పంచమి రోజున అలిగిన బతుకమ్మగా వ్యవహరిస్తారు. పూర్వకాలంలో ఆరవ రోజు బతుకమ్మ పేర్చేటప్పుడు మాంసం ముద్ద తగిలి అపచారం జరిగిందట. తెలంగాణ గ్రామ దేవతలకు కోడి మేక గొర్రె ను నైవేద్యంగా(బలిగా) సమర్పించడం ఆచారంగా ఉంది. కానీ బతుకమ్మ ఎవరినీ చావమ్మ అని అనదు కాబట్టి బతుకమ్మకు అలా బలి ఇవ్వడం కానీ, మాంసాన్ని ప్రసాదంగా అర్పించడం కానీ ఆచారంగా ఏర్పడలేదు. ఈ విషయం తెలియని ఓ యువతి మాంసం ముక్కల్ని ప్రసాదంగా పెట్టడంతో కాకులు అరిచాయి. దీంతో అపచారం జరిగిందని ఈరోజు బతుకమ్మ అలిగి ఏదీ తినదంటారు. కావున ఈరోజు పూలతో బతుకమ్మను తయారు చేయరు. అంటే ఆరవ రోజు అర్రెంగా భావించి బతుకమ్మలు పేరువరు. ఆడరు. నైవేద్యం కూడా ఏదీ సమర్పించరు. బతుకమ్మ అలక తీరాలని మహిళలు ప్రార్థిస్తారు. కొన్నిచోట్ల బతుకమ్మలను పేర్చి ఆడినా ఆరోజు ప్రసాదం ఏమి ఉండదు.

**ఏడవ రోజు:**

వేప కాయల బతుకమ్మ. ఏడవ రోజైన ఆశ్వీయుజ శుద్ధ షష్టి నాడు తంగేడు, గునుగు, చామంతి, మందార, బీర తదితర పువ్వులతో ఏడు ఎత్తుల్లో(దొంతరలలో) బతుకమ్మ పేరుస్తారు. బియ్యం పిండిని (సకినాలు చేసే పిండిని) బెల్లం కలిపి వేపకాయలంతా పరిమాణంలో చేసి, నూనెలో వేయించిన వంటకాన్ని బతుకమ్మకు నివేదిస్తారు. అందుకే ఏడో రోజు బతుకమ్మను వేపకాయల బతుకమ్మ పిలుస్తారు.

**ఎనిమిదవ రోజు:**

వెన్నముద్దల బతుకమ్మ. ఎనిమిదవ రోజైన ఆశ్వీయుజ శుద్ధ సప్తమి నాడు తంగేడు, గునుగు, చామంతి, మందార, బీర తదితర పూలతో ఎనిమిది ఎత్తుల్లో(దొంతరల్లో) బతుకమ్మను పేర్చుతారు. వెన్న లేదా నెయ్యిలో నువ్వులు, బెల్లం కలిపి చేసిన పదార్థాలను నివేదించి ప్రసాదంగా పెడుతారు కాబట్టి వెన్నముద్దల బతుకమ్మ అని పిలుస్తారు.

**తొమ్మిదో రోజు:**

సద్దుల బతుకమ్మ. తొమ్మిదవ రోజైన ఆశ్వీయుజ అష్టమి(దుర్గాష్టమి) నాడు గుమ్మడి ఆకులను తమ్మాలంలో పరిచి తంగేడు, గునుగు, గడ్డి, కట్లపూలు, బంతి చామంతి, మందార, తదితర పూలతో 9 ఎత్తుల్లో(దొంతరల్లో) బతుకమ్మను పెద్దగా పేరుస్తారు. పెద్ద బతుకమ్మకు తోడు చిన్న బతుకమ్మ పేర్చి చిన్న బతుకమ్మపై గుమ్మడి పువ్వులోని అండాశయాన్ని గౌరమ్మగా భావించి ఉంచుతారు. దీని పక్కనే తమలపాకులలో పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి పూజలు చేస్తారు. మలీద ముద్దలు(లడ్డూలు),ఐదు రకాల సద్దులను ఈరోజు బతుకమ్మకు నివేదిస్తారు. మలీద ముద్దలతో పాటు పెరుగన్నం సద్ది, చింతపండు పులిహోర సద్ది, నిమ్మకాయల పులిహోర సద్ది, కొబ్బరి తురుము సద్ది, నువ్వుల పొడి కలిపిన సద్ది అయిదు రకాల సద్దుల్లో ఉంటాయి కాబట్టి సద్దుల బతకమ్మ అని పిలుస్తారు.

ఇలా తొమ్మిది రోజులు పాటు బతుకమ్మలను పేర్చి, ఫలహారాలతో గ్రామ బొడ్రాయి వద్ద బతుకమ్మలను పెట్టి, అన్ని వర్గాల వారు అక్కడ చేరి, బతుకమ్మలు ఆడుతారు. ఈ పండుగ అన్ని కులాలు, వర్గాల మధ్య స్నేహాన్ని, ఐక్యతను, గ్రామ బంధుత్వాన్ని పెంచుతుంది. బొడ్రాయి వద్ద బతుకమ్మలు ఆడి అలసిపోయిన తర్వాత చెరువు వద్దకు తీసుకెళ్లి అక్కడ కొంతసేపు బతుకమ్మలు ఆడి చివరగా చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేసి ఫలహారాలను ఒకరికి ఒకరు పంచుకొని ఆరగిస్తారు.





